మన నదులు
కృష్ణా గోదావరులు

కూర్పరి :

డా॥ సి. వి. రామచంద్రరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్ :: హైదరాబాద్

సారస్వత వికాస ప్రచురణలు-2

మన నదులు
కృష్ణా గోదావరులు

కూర్పరి :
డా॥ సి. వి. రామచంద్రరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ : : హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1982 డిసంబరు
ప్రతులు : 2000

వెల రూ. 3-00

భారత ప్రభుత్వంవారు సరసమైన వెలకు లభింపజేసిన కాగితంపై
ఈ పుస్తకం ముద్రించబడినది.

మాధవి ఆర్ట్ ప్రింటర్స్, కుత్బిగూడ, హైదరాబాదు-500 027.

తొలిపలుకు

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించే కార్యక్రమాలలో గ్రంథ ప్రచురణము ముఖ్యమైనది. ఇంతవరకు ఈ ప్రచురణలు మూడు విభాగాలకు చెంది ఉండేవి. అవి పండిత సాహిత్యం, ప్రజాసాహిత్యం, బాలసాహిత్యం. వీటితోపాటు సాధారణమైన విద్యా పరిజ్ఞానం కలిగిన పాఠకలోకంకోసంకూడా పరిషత్తు కొన్ని గ్రంథాలను ప్రచురించ దలచుకొన్నది. ఆ ప్రయత్నంలో భాగమే ఇది.

తెలుగుభాష ఆధునిక భాషగా రూపొందడానికి, సాధారణ విద్యాగంధం కలిగినవారిలో పఠనాసక్తిని పెంపొందించడానికి, వారికి లోకజ్ఞానాన్ని కలగజేయడానికి తగిన గ్రంథాలు తెలుగులో చాలా తక్కువగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ రంగంలో తగుమాత్రంగా కృషిచేయాలని పరిషత్తు నిశ్చయించుకున్నది. ఇందుకుగాను 'సారస్వత వికాస ప్రచురణలు' అనే పేరిట వరుసగా సులభశైలిలో గ్రంథాలను పరిషత్తు ప్రచురిస్తుంది. శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ, డా॥ కె. కె. రంగనాథాచార్యులు— వీరితో దీనికొక సంపాదక మండలిని పరిషత్తు కార్యనిర్వాహకవర్గం ఏర్పరచింది. ఈ వరుసలో ఇంతకుముందే 'జాతీయ నాయకులు' అనే పుస్తకం వెలువడింది. ఇది రెండవది.

కోరగానే ఈ గ్రంథం వ్రాతప్రతిని సిద్ధంచేసి ఇచ్చినవారు డా॥ సి.వి. రామచంద్రరావుగారు. వారికి మా కృతజ్ఞతలు. ఈ గ్రంథాన్ని

అందంగా ముద్రించి ఇచ్చిన మాధవి ఆర్ట్ ప్రింటర్స్ వారికి కూడా మా కృతజ్ఞతలు.

మా ప్రచురణ కార్యక్రమానికి చేయూతనిచ్చి ఆర్థిక సహాయం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము.

మా ఈ కృషిని సహృదయులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

తిలక్ రోడ్,
హైదరాబాదు.
1-9-1982

ఇట్లు
కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

విషయ సూచిక

మన నదులు
కృష్ణా గోదావరులు

" ఆంధ్రకాః! కృష్ణా గోదావర్యోః మధ్యే విద్యమానో దేశః" అని వ్యాసుడు భారతంలో పేర్కొన్నాడు. సభాపర్వంలో సహదేవుని దిగ్విజయ యాత్రా సందర్భంలో చెప్పిన మాట ఇది. దీనివల్ల కృష్ణా గోదావరీ నదుల నడుమనున్న దేశాన్ని అతి ప్రాచీన కాలం నుండీ ఆంధ్రదేశం అని పిలుస్తున్నట్లు తెలుస్తుంది. కృష్ణా గోదావరి నదులు ఆంధ్రదేశాన్ని అన్నపూర్ణను చేశాయి. ఆంధ్రుల ప్రేమను, గౌరవాన్ని, పూజలను అందుకుంటున్నాయి. ఈ నదుల పుట్టినిల్లు మహారాష్ట్ర, మెట్టినిల్లు ఆంధ్రప్రదేశ్. మహారాష్ట్రలో మొదలై క్రమక్రమంగా విశాలమౌతూ, ఎన్నో ఉపనదులు వచ్చి చేరుతూ ఉండగా ఆంధ్రదేశంలో అడుగుపెట్టాయి. తాము ప్రవహించినంత దూరమూ సుభిక్షంచేశాయి. ఆంధ్రప్రదేశంలోనే తూర్పు తీరంలో సముద్రంలో కలిశాయి. కృష్ణా గోదావరులు తమ ఉపనదులతో కలసి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తాగటానికి మంచినీటిని అందిస్తున్నాయి. వ్యవసాయానికి, విద్యుచ్ఛక్తిని ఉత్పాదించడానికి తోడ్పడుతున్నాయి. ఈ రాష్ట్రాల సర్వతోముఖ సౌభాగ్యానికి కారణమౌతున్నాయి. ముఖ్యంగా ఆంధ్ర

ప్రదేశ్ రాష్ట్రానికి ఈ నదీ జలాల ఉపయోగం చాలా ఎక్కువ. దక్కను పీఠభూమి పడమటి కనుమలనుండి బంగాళాఖాతం వైపుకు వాలిఉంది. ఈ పడమటి కనుమలనే సహ్యాద్రులని కూడా అంటారు. ఇట్లు పడమటి నుండి తూర్పుకు వాలి ఉండడంవల్ల ఈ పీఠభూమిలో ప్రవహించే నదులన్నీ పడమటి నుండి తూర్పుకి ప్రవహిస్తాయి. కావేరి, పెన్న, కృష్ణ, గోదావరి మొదలైన నదులు తూర్పు సముద్రంలో కలుస్తున్నాయి.

కృష్ణా గోదావరి నదులు పురాణ ప్రసిద్ధాలు. మన పురాణాలలో, ఇతిహాసాలలో, ప్రాచీన అర్వాచీన కావ్యాలలో వీటిని గురించిన కథలున్నాయి. మన నిత్యజీవితంలో ఈ నదులు నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైంది. అందుకనే మన సాహిత్యములో వీటిని గురించి ఎన్నో గాథలు పుట్టాయి.

పురాణ కావ్యేతిహాసాలలో కృష్ణా గోదావరులు

భారతీయులు తమ జీవనానికి ఆధారాలయిన నదులను పుణ్యప్రదాలుగా భావిస్తారు. ప్రకృతి సౌందర్యంతో విలసిల్లే మనోహర నదీతీరాలలో దేవాలయాలను నిర్మించుకున్నారు. "తీర్థగమన ఫలంబెల్ల పుణ్యములకు" అని నమ్మిన వారు మన పూర్వులు. ఈ తీర్థాలను సేవించటం, వాటి తీరాన ఉన్న క్షేత్రాలను దర్శించడం పుణ్యప్రదమని భావించారు.

ప్రపంచమంతటా గొప్ప నాగరికతా కేంద్రాలన్నీ నదీ తీరాల్లోనే ఉన్నాయి. నదీ తీరాలలో నదీసంగమ స్థానాలలో అనేక మహానగరాలు వెలిశాయి. ఈ నగరాలు పురాణ ప్రసిద్ధి,

చారిత్రక ప్రసిద్ధి కలిగినవి. అతి ప్రాచీన కాలం నుండీ భారతీయ నాగరికతా సంస్కృతులకు ఆటపట్టులుగా ఉన్నాయి. అందుచేత భారతీయ నదులన్నింటికీ సంబంధించి ఎన్నో గాథలు ప్రచారంలోకి వచ్చాయి. వాటి మహత్తులను వర్ణించే ఘట్టాలు పురాణాలలో వెలిశాయి. ప్రధాన నగరాలన్నీ నదీ తీరాలలోనే ఉంటూ ఉండటం వల్ల అక్కడ ఎన్నో ప్రధాన చారిత్రక సంఘటనలు జరగడం సహజం. ఈ సంఘటనలుకూడా పురాణాలలో, కావ్యాలలో స్థానం సంపాదించాయి. మన కవులు సంస్కృతంలో, ప్రాంతీయ భాషల్లో రచించిన మహాకావ్యాలలో సందర్భాను సారంగా మహానదుల సౌందర్యాన్ని వర్ణించారు. కృష్ణా, గోదావరి నదులను గురించి పురాణాలలోనూ, సంస్కృత కావ్యాలలోనూ, తెలుగు గ్రంథాలలోనూ ఎన్నో ప్రశంసలున్నాయి.

పుణ్యప్రదాలు, ప్రధానాలు అయిన నదులను మనవాళ్ళు సంకల్పంలో నిత్యం స్మరించుకుంటారు. ఈ సంకల్ప శ్లోకంలో గోదావరి ఉంది.

శ్లో. గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు.

దక్కను పీఠభూమికి పడమర అరేబియా సముద్రతీరం వెంట పొడవైన గోడలాగా సహ్యాద్రులు వ్యాపించి ఉన్నాయి. కృష్ణా గోదావరినదులు ఈ సహ్యాద్రులలోనే పుట్టాయి. సహ్యాద్రులలో పుట్టిన నదులను విష్ణుపురాణం ఇట్లా పేర్కొన్నది.

శ్లో. గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాది కాస్తథా
సహ్యపాదోద్భవానద్యః స్మృతా పాపభయాపహాః॥

ఈ విషయాన్నే మార్కండేయ పురాణం కూడా ఇట్లా చెప్తున్నది.

శ్లో. గోదావరీ భీమరథీ కృష్ణవేణీ తథాపరా
తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కావేర్యథాపగాః
సహ్యపాద వినిష్క్రాంతా ఇత్యేతాః సరిదుత్తమాః॥

రామాయణం ఆదికావ్యం. ఇందులో కిష్కింధాకాండలో ఆంధ్రదేశ ప్రశంస ఉన్నది. ఈ సందర్భంలో కృష్ణా గోదావరి నదులను పేర్కొన్నాడు వాల్మీకి. వ్యాసుడు రచించిన మహాభారతంలో భీష్మపర్వంలో భరతవర్షంలోని నదుల ప్రశంస ఉన్నది. వీటిలో కృష్ణాగోదావరులున్నాయి. క్రీ.శ. మొదటి శతాబ్దంలో దక్షిణాపథాన్ని శాతవాహన చక్రవర్తి హాలుడు పరిపాలించాడు. ఈయన ఆస్థానంలో గాథా సప్తశతి అనే ప్రాకృత కావ్యం వెలిసింది. ఈ కావ్యంలో గోదావరి ప్రశంస ఉన్నది. మహాకవి కాళిదాసు రచించిన రఘువంశ కావ్యంలో దండకారణ్యం వింధ్యకు దక్షిణంగా గోదావరి నదివరకు వ్యాపించి ఉందని చెప్పాడు. ప్రసిద్ధ సంస్కృత నాటక కర్త భవభూతి ఏడవ శతాబ్దంవాడు. తన ఉత్తర రామ చరిత నాటకంలో గోదావరిని వర్ణించాడు. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దంవాడు రాజశేఖరుడు ప్రసిద్ధ ఆలంకారికుడు. ఆయన తన కావ్యమీమాంసలో గోదావరిని ప్రశంసించాడు. పదమూడవ శతాబ్దం వాడైన రాజశేఖరసూరి,

తన 'ప్రబంధకోశం'లో, పదిహేడవ శతాబ్దం వాడైన వేంకటాధ్వరి తన 'విశ్వగుణాదర్శం'లో గోదావరిని ప్రశంసించారు.

సప్త గోదావరి

గోదావరీనది ఆంధ్రదేశంలో చాలాదూరం ప్రయాణించి తర్వాత సముద్రానికి అరవై నాలుగు కిలోమీటర్ల దూరంలో ధవళేశ్వరం వద్ద పాయలుగా చీలింది. ధవళేశ్వరం రాజమండ్రికి కొంచెం దిగువన ఉంది. ఇక్కడ చీలిన గోదావరి సప్త గోదావరిగా విస్తరించింది. ఈ సప్తగోదావరిని, కృష్ణవేణిని మిగిలిన నదులతో పాటు భాగవత పురాణం ఇట్లా పేర్కొన్నది.

శ్లో. గయాం గత్వా పితౄనర్చ్య గంగా సాగర సంగమే
ఉపసర్ప్య మహేంద్రాద్రౌ రామందృష్ట్వాభివాద్యచ
సప్త గోదావరీం వెణ్ణాం పంపాం భీమరథీ తతః॥

గౌతమీ మహాత్మ్యంలోని సప్తసాగర మాహాత్మ్యంలో ఈ సప్తగోదావరులను పేర్కొనే శ్లోకం ఇది.

శ్లో. గౌతమ్యాస్స ప్తధా ప్రోక్తస్సంగ మస్సరితాంపతౌ
తుల్యాత్రేయీ భరద్వాజీ గౌతమీ వృద్ధ గౌతమీ
కౌశికీచ వసిష్ఠాచ సప్తభాగా ప్రకీర్తితా.

(1) తుల్య (2) ఆత్రేయ (3) భరద్వాజ (4) గౌతమి (5) వృద్ధ గౌతమి (6) కౌశికి (7) వసిష్ఠ ఇవి సప్త గోదావరులు.

శాతవాహన చక్రవర్తి హాలుడు సింహళ రాజకుమార్తె లీలావతిని వివాహమాడాడు. ఈ విషయాన్ని వర్ణించే ప్రాకృత కావ్యం 'లీలావతి'. లీలావతీ కావ్యం సప్తగోదావరిని, దాని తీరాన భీమేశ్వర స్వామిని పేర్కొంటున్నది. ప్రసిద్ధ నాటక కర్త మురారి సంస్కృతంలో అనర్ఘరాఘవ నాటకాన్ని రచించాడు. ఇందులో ఏడో అంకంలో సప్తగోదావరీ హారకలాప నాయకమణి అయిన దాక్షారామ భీమేశ్వర స్వామికి నమస్కరింపచేశాడు.

విభీషణుడు రామునితో ఇట్లా అన్నాడు :

విభీషణః (దక్షిణతో దర్శయన్) :

> దేవ! ప్రణమ్యతా మయాఽఽన్ధ్రవిషయ లక్ష్మ్యాః సప్త
> గోదావరీహారకలాపైక నాయకో భగవాన్భీమేశ్వరః.

భారతీయుల్లో మొదటి చరిత్రకారుడు కల్హణుడు. ఈయనది కాశ్మీరదేశం. పన్నెండో శతాబ్దంవాడు. ఈ మహాకవిని సప్తగోదావరి తుముల తరంగాలు ఆకర్షించాయి. తన చారిత్రక కావ్యం 'రాజ తరంగిణి' లోని ఏడు తరంగాలను గోదావరినది ఏడుపాయలతో పోల్చాడు కల్హణుడు.

> శ్లో. గోదావరీ సరి దివోత్తుముళై స్తరంగైః
> వక్త్రైః స్ఫుటం సపది సప్తభిరాపతన్తీ
> శ్రీ కాన్త రాజవిపులాభి జనాబ్ధి మధ్యం
> విశ్రాన్తయే విశతి రాజ తరంగిణీయమ్.

తెలుగు కవులు గోదావరిని గంగ అనీ, గౌతమీ గంగ అనే ఎక్కువగా పేర్కొన్నారు. మహాభారతం ఆది పర్వంలో అర్జునుని తీర్థయాత్రా సందర్భంలో నన్నయ వేంగి దేశాన్ని, గోదావరినీ వర్ణించాడు. ఈ వర్ణన మూల భారతంలో లేదు. సందర్భం సరిపోయింది కాబట్టి నన్నయ స్వదేశాన్ని వర్ణించి సంతోషపడ్డాడు. ఇక్కడ గోదావరిని నన్నయ దక్షిణ గంగ అని వర్ణించాడు. "దక్షిణ గంగనా దద్దయు నొప్పిన గోదావరియు, జగదాదియైన భీమేశ్వరంబును, బెడగగు శ్రీ పర్వతంబు...". బమ్మెర పోతరాజు ఆంధ్ర మహాభాగవతంలో గోదావరిని "అభ్రంకష శుభ్ర సముత్తుంగ భంగయగు గంగ" అని వర్ణించాడు. మడికి సింగన కూడా తన "పద్మపురాణం" ఎనిమిదో ఆశ్వాసంలో గోదావరికి పర్యాయ పదంగా గంగను వాడాడు. కాని సప్త గోదావరీ వైభవాన్ని, సప్త గోదావరి తీరంలోని క్షేత్రాల ప్రాశస్త్యాన్ని కవి సార్వభౌముడు శ్రీనాథుడు వర్ణించినట్లు మరే తెలుగు కవీ వర్ణించలేదు. శ్రీనాథుడు తన "భీమేశ్వర పురాణం"లో సప్త గోదావరీ వైభవాన్ని పాఠకులకు సాక్షాత్కరింపచేశాడు. 'సారమహిమ'లో గంగ కంటే గోదావరే మిన్న అంటాడు శ్రీనాథుడు.

తే. రాజ వంశజుఁడగు భగీరథుని వెనుకఁ
బాఱుతెంచిన చదలేఱు పాటి యగునె
సప్తముని రాట్ప్రతాప సంప్రాప్తమైన
సప్త గోదావరంబుతో సారమహిమ.

అంతే కాదు, "ఆంధ్ర భూభువన మధ్య పుండరీకంబు

సప్తగోదావర జలము తేనె" అన్నాడు. గౌతమీగంగకు మరే యితర నదులు సరిరావన్నాడు.

"నీరు కడఁగోళ్ళగూడి మున్నీటిఁ గవయు
మొగులు బడి వాహినులకెట్లు మొరయ వచ్చు
వార్ధి లేడింటికి వలపు వనితయైన
మంగళోత్సంగ గౌతమీగంగ యెదుర"

సంస్కృతాంధ్ర కవులనే కాక గోదావరీ సౌందర్యం తమిళ మహాకవి కంబన్‌నుకూడా ఆకర్షించింది. కాకతీయ మొదటి రుద్రదేవునికాలం (11 వ శతాబ్దం) లో కంబన్ ఆంధ్ర దేశానికి వచ్చాడట. ఈ సందర్భంలో గోదావరిని, ఓరుగల్లును దర్శించాడని చెప్తారు. కంబన్ తమిళంలో రామాయణం రాశాడు. కంబన్ రామాయణం అరణ్యకాండలో శూర్పణఖా పటలంలో గోదావరిని, మిక్కిలి మనోజ్ఞంగా వర్ణించాడు. "భూదేవికి అలంకారము, శ్రేష్ఠమైన జలములను పొలములకు సమకూర్చునది, వేడిని పోగొట్టగలుగు రేవులుగలది, అనేక ప్రదేశముల మీదుగా ప్రవహించునది, చల్లనిది, వరదలతో పొంగునది, కవులు వాకొను సరళ కవిత్వమువలె భాసించునది అగు గోదావరీ మహానదిని శౌర్యోపేతులగు రామలక్ష్మణులు దర్శించిరి." ఈ విధంగా భారత దేశమంతటా గోదావరిని కవులు ప్రశంసించారు. కావ్యగౌరవాన్ని కలిగించారు.

గోదావరి నదితో పోలిస్తే కృష్ణానదిని గురించి కావ్యాలలో కనిపించే ప్రశంస తక్కువేనని చెప్పాలి. ఆంధ్ర మహాభారతంలో అరణ్యపర్వం ద్వితీయాశ్వాసంలో పుణ్యతీర్థగమన

ఫలాన్ని చెప్పాడు నన్నయ. ఈ సందర్భంలో కృష్ణా గోదావరులలో స్నానం చేస్తే కలిగే ఫలాన్ని ఈ విధంగా తెలిపాడు. "తొల్లి శతక్రతుండు నూఱు క్రతువులు సేయుటం జేసి పవిత్రంబయిన కృష్ణవేణి యందు దేవహ్రదంబాడిన సర్వ పాప వినాశనంబగు .... గోదావరీ స్నానంబు సేసిన దశాశ్వమేధ ఫలంబు వడయుదురు...సప్త గోదావరీ తీర్థంబును నాడిన పుణ్యులు పుణ్యలోకప్రాప్తులగుదురు."

మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చికం, ధనుస్సు, మకరం, కుంభం, మీనం, అని పన్నెండు రాశులు. గురు గ్రహం ఈ పన్నెండు రాశులలో ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రాశిలో ఉంటుంది. ఈ గురు గ్రహం సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరికి పుష్కర సంవత్సరం. సూర్యునికి పుష్కరుడని పేరు. సూర్య గ్రహం (పుష్కరుడు) మేషాది రాశుల్లో ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క మాసం ఉంటుంది. సింహ రాశిలో గురువు, సూర్యుడు కలిసి ఉంటే గోదావరికి పుష్కర మాసం. అట్లాగే గురువు కన్యారాశిలో ప్రవేశించినప్పుడు కృష్ణకు పుష్కర సంవత్సరం. కన్యారాశిలో గురువు సూర్యుడు కలసి ఉంటే కృష్ణకు పుష్కర మాసం. ఈ పుష్కర మాసాలలో మొదటి పన్నెండు రోజులు, పక్షాంతరంలో చివరి పన్నెండు రోజులు చాలా పవిత్రమైనవి. ఆ రోజులలో కృష్ణా గోదావరులలో స్నానం చేయడం చాలా పుణ్యప్రదమని భారతీయుల నమ్మకం.

కృష్ణా, గోదావరులు - శాసన వాఙ్మయం

దక్షిణాపథంలో క్రీ. శ. నాలుగో శతాబ్దం చివరదాకా ప్రాకృతమే రాజభాష. శాసనాలన్నీ ప్రాకృతంలోనే ఉన్నాయి. ప్రాకృత శాసనాలలో కృష్ణా నదిని 'కణ్ణబెమ్నా', 'కరబెణా', 'కన్హవణ్ణా' అని పేర్కొన్నారు. నాలుగో శతాబ్దం తర్వాత క్రమక్రమంగా సంస్కృతం ప్రాకృతం స్థానాన్ని ఆక్రమించ సాగింది. శాసనాలు సంస్కృతంలో వేయడం ప్రారంభ మయింది. సంస్కృతం, తెలుగు కలిసిన ద్విభాషా శాసనాలు మొదలయ్యాయి. సంస్కృతశాసనాలలో, మిశ్ర శాసనాలలో 'కృష్ణవేణ్ణ' అని, 'కృష్ణవేణి' అనీ కనిపిస్తుంది. కృష్ణకు 'వేణి' నది ఉపనది. 'వేణి'తో కలిపి 'కృష్ణ'కు కృష్ణవేణి అన్న పేరు వచ్చింది. కృష్ణా జిల్లా నాదెండ్లలోని గోవర్ధన స్వామి దేవాల యంలో క్రీ. శ. 1258 లో కోట గణపతి దేవరాజు ఒక శాసనం వేశాడు. ఈ శాసనంలో కృష్ణానది వర్ణన ఇట్లా ఉంది.

శ్లో. యద్వార వధ్వః పయసాం విహారే కుర్వంతి పీన స్తన
కుంకుమేన । భువస్సిందూర పరాగయోగాం సీమంత
రేఖామివ కృష్ణవేణ్యాం।

మధ్యయుగ తెలుగు శాసనాలలో వెలనాడు లేక ఆరు వేల వెలనాడు అని ఒక భూభాగాన్ని పేర్కొనడం జరిగింది. ఇది గుంటూరు జిల్లాలోని గుంటూరు, తెనాలి, రేపల్లె తాలూకా లకు సరిపోతుంది. దీన్నే షట్సహస్ర దేశం అనికూడా సంస్కృ తీకరించారు. ఈ ఆరువేల వెలనాడు కృష్ణవేణికి దక్షిణాన ఉన్న తీరదేశమని శాసనాలు చెపుతున్నాయి. వెలనాటిని పరిపాలించిన

రాజులను 'కృష్ణవేణ్ణా నదీతీర షట్సహస్ర విషయాధీశ్వరు'లని శాసనాలు వర్ణించాయి.

'కృష్ణ' అన్నది సంస్కృతనామం. శాసనాల్లో 'పేరేఱు' అన్న తెలుగుపేరు, 'పెర్దొఱె' అన్న కన్నడపేరు, 'పేరాఱు' అన్న తమిళపేరు కూడా కనిపిస్తున్నాయి. ఇక్కడ పేరు అంటే పెద్ద. ఎఱు, తొఱె, ఆఱు అన్న ద్రావిడ పదాలు ప్రవాహం, లేక నదిని సూచిస్తాయి. ఉదాహరణకు కృష్ణకు దక్షిణాన ఉన్న వెలనాటిని క్రీ. శ. 1061 నాటి ఒక శాసనం ఇట్లా పేర్కొన్నది.

"స్వస్తిశ్రీ సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజుల...శక వర్షంబులు 983 నేంటి ప్లవ సంవత్సరంబున పేరేటి దక్షిణంబున యాఱువేల వెలనంటి......"

గోదావరీ నది శాసనాలలో గోదావరి అనీ, గౌతమీ గంగ అనీ కనిపిస్తుంది. కలచురి శకము 823 (క్రీ.శ.1072లో) కలచురి యశః కర్ణదేవుడు తామ్రశాసనం వేయించాడు. ఈ రాజు ఒక ఆంధ్రాధీశుని (ఏడవ విజయాదిత్యుడు?) జయించిన సందర్భంలో, గోదావరి నది ఏడుపాయలు సప్తస్వరాలై భీమేశ్వరుని స్తుతిస్తున్నట్లు శాసన కవి మనోహరంగా వర్ణించాడు. ఆ శ్లోకమిది.

శ్లో. ఆంధ్రాధీశ మరంధ్ర దోర్విలసితమ్ స్వచ్ఛంద ముచ్ఛిందతా
యానాభ్యర్చ్యత భూరిభిః స భగవాన్ భీమేశ్వరో భూషణైః
యస్యాభ్యర్ణగతా ప్రనృత్యలహరీ భ్రూవల్లి గోదావరీ
గాయత్యున్మద హంసనాద మధురైః స్రోతః స్వరైః సప్తభిః.

కాకతీయ ప్రతాపరుద్రుని (1298-1323) ఖండపల్లితామ్ర పట్టికలు గౌతమీ గంగ ఆంధ్రదేశానికి ముత్యాల సరంలాగా ఉందని వర్ణించాయి.

శ్లో. ఆంధ్రః ఖల్వస్తిదేశః సకలసుఖ పరీపాక సౌరభ్యసీమా
యత్రాస్తే ముక్త ముక్తావలిరివ విమలా గౌతమీనామగంగా॥
బాష్పైరానంద జాతైరివ కటకతటీ ఝర్ఝరైర్నిర్ఝరాఘైః
దోర్భిర్వ్యాసక్త నృత్తైరివ వలిత మరుత్కంపితైః శ్శాఖి
కాండైః। గానైర్గాంధార గర్భైరివ మధురతమైస్తత్ప్రసూ
నాక్తనాదైః। స్సార్ధం యత్రస్థితః శ్రీగిరి రఖిలపతిం మౌలి
భాగే దధానః॥

కృష్ణా, గోదావరులు - చరిత్ర

దక్షిణాపథ చరిత్రకూ, దాని నాగరికతా సంస్కృతులకూ, కృష్ణా గోదావరి నదులతో అవినాభావ సంబంధం ఉన్నది. మౌర్య సామ్రాజ్యం పతనం అయిన తర్వాత ఆంధ్ర శాతవాహనులు కృష్ణా గోదావరుల నడిమి దేశంలో రాజ్యస్థాపన చేశారు. క్రమ క్రమంగా ఒక మహాసామ్రాజ్యాన్ని నిర్మించారు. దక్షిణాపథ చరిత్రకూ, నాగరికతా సంస్కృతులకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందటి చరిత్ర అంతా అస్పష్టం. శాతవాహన సామ్రాజ్యానికి రాజధానులు ప్రతిష్ఠానం, అమరావతి. ప్రతిష్ఠానాన్ని ఇప్పుడు పైఠన్ అంటున్నారు. అమరావతికే ధాన్యవాటి, ధనకటకము, ధాన్యకటకము అని పేర్లున్నాయి. ప్రతిష్ఠానం గోదావరీ తీరంలోనూ, అమరావతి కృష్ణా తీరంలోనూ ఉన్నాయి. సంస్కృత కవి రాజశేఖరసూరి తన 'ప్రబంధకోశం'లో గోదా

వరిని ఇట్లా ప్రశ్నించాడు. "తూర్పు సముద్రంలో కలవడానికి ప్రవహిస్తూన్న ఓ గోదావరీ! నీ తీరంలో శాతవాహనుల పట్టణమైన ప్రతిష్ఠాన పురంతో తులతూగే మరో పట్టణం ఉందా?"

కృష్ణా గోదావరీ నదుల మధ్యదేశానికి ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖస్థానము ఉంది. ఆంధ్రదేశమంటే ఈ ప్రాంతమేనని భారతం చెప్తున్నది. ముఖ్యంగా తూర్పు కనుమలకు సముద్రానికి మధ్య ఉన్న ప్రాంతం చాలా సారవంతమైనది. కృష్ణా గోదావరుల చేత జల సమృద్ధమైనది. సస్యశ్యామలమైన ఈ ప్రాంతంలో జన సాంద్రత ఎక్కువ. రాజ్యాల స్థాపనకు, నాగరికతా జీవనానికి, సంస్కృతికి దోహదకారి. సంపదలకు ఆలవాలము. శాతవాహనులతో మొదలుపెట్టి ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజవంశాలన్నిటికీ కృష్ణాగోదావరులతో సంబంధం ఉన్నది. శాతవాహన రాజులలో గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి, వాసిష్ఠీ పుత్ర శ్రీ పులుమావి మొదలైన వాళ్ళున్నారు. గౌతమి, వాసిష్ఠి అన్నవి రాజమాతల పేర్లు. ఇక్ష్వాకులు కూడ తల్లి పేరును చెప్పుకోవడం అన్న సాంప్రదాయాన్ని అనుసరించారు. ఉదాహరణకు వాసిష్ఠీపుత్ర శ్రీ శాంతమూల. గౌతమి, వాసిష్ఠి అన్నవి నదుల పేర్లు. ఆనాటి రాజవంశాలకు చెందిన స్త్రీలు నదుల పేర్లను పెట్టుకోవడం వాటి ప్రాధాన్యతను, గౌరవాన్ని సూచిస్తుంది. బహుశా సామాన్యులు కూడా ఈ పేర్లు ఎక్కువగానే పెట్టుకొని ఉంటారు. ఇప్పటికీ మహారాష్ట్రంలో, ఆంధ్రదేశంలో గోదావరీబాయి, కృష్ణాబాయి, కృష్ణవేణమ్మ మొదలైన పేర్లు వినిపిస్తూనే ఉంటాయి.

కృష్ణా నదీ ముఖద్వారం నాటికి, నేటికి తెలుగు వారి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక జీవనానికి మూల స్థానంగానే ఉన్నది. క్రీ. శ. మూడు, నాలుగు శతాబ్దాలలో కృష్ణా నదీ ప్రాంత తూర్పు తీర దేశాన్ని మహోజ్వలంగా పరిపాలించిన వారు ఇక్ష్వాకులు. ఇక్ష్వాకుల రాజధాని కృష్ణా తీరంలోని విజయపురి (నేటి నాగార్జునసాగర్). కృష్ణా నది ఉత్తర తడ ప్రదేశాన్ని నాలుగో శతాబ్దంలో పరిపాలించిన వారు బృహత్ఫలాయనులు. బృహత్ఫలాయనుల రాజధాని కూదూరు లేక గూడూరు. ఇది కృష్ణానది ముఖద్వారంలో ప్రఖ్యాతి వహించిన వర్తక స్థానం. ఇదే కాలంలో కృష్ణాగోదావరుల మధ్య కొంత భాగాన్ని శాలంకాయనులు పరిపాలించారు. శాలంకాయనుల రాజధాని వేంగి (ఏలూరు తాలూకా, పశ్చిమగోదావరి జిల్లా; ఏలూరుకు పదమూడు కిలోమీటర్ల దూరంలో ఉంది.) ఇది గోదావరీ నదీ తీరంలో ఉంది. క్రీస్తు శకారంభ శతాబ్దాలలో ఇప్పటి గుంటూరు జిల్లాలోని కొంత భాగాన్ని ఆనంద గోత్రీకులు పరిపాలించారు. వీరిలో ఆనందకందర రాజుకు 'కృష్ణవేణ్ణానాథు' డనే బిరుదం ఉంది. శాలంకాయనుల తర్వాత క్రీ. శ. అయిదో శతాబ్దం రెండోసగం నుండి ఏడో శతాబ్దం ప్రారంభం వరకూ విష్ణుకుండినులు పరిపాలించారు. వీళ్ళు 'శ్రీ పర్వత పాదానుధ్యాతు' లమని చెప్పుకున్నారు. కృష్ణ ఒడ్డున విజయవాడ సమీపంలో మొగల్రాజపురం, ఉండవల్లి గుహాలయాలను నిర్మించిన కళాపోషకులు విష్ణుకుండినులు. ధాన్యకటకం రాజధానిగా మూడో శతాబ్దం చివర 'ఆంధ్రాపథా'న్ని కొంతకాలం ఆదిపల్లవులు పరిపాలించారు. ఉత్తరాన మహేంద్ర పర్వతంనుండి దక్షిణాన

మన్నేరుదాకా తమ రాజ్యాన్ని విస్తరించుకుని పరిపాలించిన వారు తూర్పు చాళుక్యులు - వీళ్ళను వేంగి చాళుక్యులనీ, పూర్వచాళుక్యులనీ కూడా అంటారు. క్రీ. శ. ఏడో శతాబ్దం నుండి పదకొండో శతాబ్దం వరకూ పరిపాలించారు. వీరి మొదటి రాజధాని గోదావరీ తీరంలోని వేంగి. తర్వాత కృష్ణాతీరంలోని బెజవాడకు రాజధానిని మార్చారు. చివరిరోజుల్లో మళ్ళీ గోదావరీ తీరములోని రాజమహేంద్రవరానికి రాజధానిని మార్చారు. తూర్పు చాళుక్యుల తరువాత ఆంధ్రదేశాన్ని కాకతీయులు పరిపాలించారు. కాకతీయులకు సామంతులుగా వెలనాటి, కోట మండలేశ్వరులు కృష్ణవేణీ నదికి దక్షిణాన ఉన్న షట్సహస్ర గ్రామావనికి వల్లభులయ్యారు.

కళింగాంధ్రానికి తీరాంధ్రానికి గోదావరి సహజమైన సరిహద్దుగా చాలాకాలం నిలిచింది. గోదావరీ తీరాన అనేక యుద్ధాలు జరిగాయి. ఇటువంటి యుద్ధాలలో ఒకటి క్రీ.శ. 1213లో జరిగింది. ఈ యుద్ధంలో కాకతి గణపతిదేవ చక్రవర్తి నెల్లూరు తెలుగు చోళ రాజైన మనుమసిద్ధి సహాయంతో కళింగాన్ని పరిపాలించే గజపతి పైన విజయం సాధించాడు. ప్రసిద్ధిచెందిన ఈ విజయాన్ని శాసనకవి ఇట్లా వర్ణించాడు.

శ్లో. యః సాహాయ్యం విధిత్సుః గణపతినృపతేః
స్వేచ్ఛయా సంగరాగ్రే
గోదావర్యాం సరితినృ పతిః చర్మయష్ట్యా నివృత్య
కాళింగం స్యాన్ కలింగా నఖముఖమకరోదేకవీరై
స్తదానీమ్.

విజయనగర సామ్రాజ్యకాలంలో కృష్ణానది మహమ్మదీయ సైన్యాలకు చెలియలి కట్ట అయినది. మూడువందల ఏండ్లు విజయనగర సామ్రాజ్యానికి, ఉత్తరాన ఉన్న మహమ్మదీయ రాజ్యాలతో సంఘర్షణలకు కృష్ణానది సాక్షీభూతమై నిలిచింది. కృష్ణా తుంగభద్రా నదుల అంతర్వేది కోసమై ఈ రాజ్యాల మధ్య ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలను ఆధారం చేసుకుని కృష్ణకు ఆ పేరెందుకు వచ్చిందో చమత్కారంగా వసుచరిత్రలో ఉత్ప్రేక్షించాడు రామరాజ భూషణుడు.

శా. యాదోరాశి గభీరమూర్తి రఘునాథాధీశుఁ డుద్దండ బా
హాదర్పాంధ సపాదమల్కిక నిజామానీకముల్ ద్రుంప జ
న్యాదూరక్షితిఁ బాఱు కృష్ణకును గృష్ణాంకంబునాఁ డబ్బె, బి
బ్బీదీవ్యన్నయనాబ్జ కజ్జల జలాభీల ప్రవాహంబులన్.

రఘునాథరాయలు తిరుమలరాయల తమ్ముడు. ఈయన తన ప్రతాపంతో మూడిండ్ల తురకలను రూపుమాపాడట. మూడిండ్ల తురకలంటే గోల్కొండ, బీజాపూరు, అహమ్మద్ నగర్ మహమ్మదీయ రాజ్యాలు. ఈ రూపుమాపడంతో వారి భార్యలు (బిబ్బీలు) ఏడవగా, వారి కాటుక కంటినీరు కృష్ణలో కలసి ఆ నదీజలం నల్లనైంది. అందువల్ల దానికి కృష్ణ అని పేరు వచ్చిందని రామరాజభూషణుడు చమత్కరించాడు. ఇటువంటి చమత్కారమైన కథలే కృష్ణా గోదావరుల పుట్టుకను గురించి పురాణాల్లో ఉన్నాయి.

కృష్ణా, గోదావరులు - పౌరాణిక గాథలు

కృష్ణ : పద్మపురాణం, ఉత్తరఖండం నూటపద మూడో అధ్యాయంలో కృష్ణానది పుట్టుకను గురించి తెలిపే కథ ఉంది. పూర్వం చాక్షుష మన్వంతరంలో బ్రహ్మ సహ్యగిరి శిఖరం మీద ఒక యజ్ఞం చేయాలని సంకల్పించాడు. దేవతల నందరినీ ఆహ్వానించాడు. సుముహూర్త సమయానికి బ్రహ్మ పెద్దభార్య స్వర యజ్ఞస్థలాన్ని చేరుకోలేక పోయింది. బ్రహ్మ చిన్నభార్య గాయత్రితో యజ్ఞాన్ని ప్రారంభించాడు. అప్పుడు స్వర వచ్చింది. తనకు అవమానం జరిగినట్లు భావించి కోపో ద్దీపిత అయింది. యజ్ఞదీక్ష తీసుకున్న గాయత్రిని, యజ్ఞానికి వచ్చిన సర్వదేవతలనూ నదులుగా పుట్టమని శపించింది. గాయత్రి దీనికి కోపించి స్వరను కూడా నదిగా పుట్టమని శపించింది. అక్కడ సమావేశమైన హరిహరాది దేవతలంతా, తామందరూ నదీరూపాలు ధరించినట్లయితే లోకాలెల్ల నశించిపోతాయని భయపడి స్వరను శాపాన్నుపసంహరించుకోమని ప్రార్థించారు. స్వర పశ్చాత్తప్తురాలయింది. అయినా శాపానికి తిరుగు లేదు కాబట్టి బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు నదులుగా భూలోకంలో పుట్టాలని, తానూ గాయత్రీ కూడా అట్లాగే పుడతామని జవాబిచ్చింది. అట్లాగే మహావిష్ణువు కృష్ణానదిగా, మహేశ్వరుడు వేణ్ణానదిగా, బ్రహ్మ కకుద్మతిగా, మిగిలిన దేవతలు వివిధ నదులుగా సహ్యపర్వత శిఖరాలనుండి ఉద్భవించారు. తూర్పుగా ప్రవహించారు. ఈ కథనుబట్టి తెలిసే యథార్థ విషయాలు రెండు. ఒకటి కృష్ణ సహ్య పర్వతం నుండి పుట్టడం. రెండు కృష్ణ, వేణ్ణ కలిసి కృష్ణవేణి కావడం.

గోదావరి - గౌతమీగంగ

భగీరథ మహర్షి ప్రయత్నఫలితంగా విష్ణుపాదాలనుంచి పుట్టిన గంగ 'ఆకాశంబుననుండి, శంభుని శిరంబందుండి, శీతాద్రి సుశ్లోకంబైన హిమాద్రినుండి భువి' చేరి భాగీరథీ గంగ అయింది. ఉత్తర భారతావనిని పునీతం చేసింది. ఇదేవిధంగా గంగ గౌతమీగంగ అయి దక్షిణ భారతావనిని పునీతం చేయడం ఎట్లా జరిగిందో చెప్పే కథ ఒకటి బ్రహ్మాండ పురాణంలోని గౌతమీ మహాత్మ్యంలో ఉన్నది. ఒకానొక సందర్భంలో గౌతమ మహర్షి ఒక ఆవును గడ్డిపోచతో అదిలించాడు. ఆ తాకిడికి అది మరణించింది. ఆ గోహత్యా పాతకాన్ని పోగొట్టుకోవడం ఎట్లా? గౌతమ మహర్షి శివుని గూర్చి ఘోర తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. శివుని జటా జూటంలోని గంగను సహ్యాద్రి పర్వతాలలోని బ్రహ్మగిరి శిఖరం మీద విడువవలసిందిగా గౌతమ మహర్షి వరం కోరాడు. పరమేశ్వరుడు అవిధంగా బ్రహ్మగిరి మీద విడిచిన గంగతో గౌతమ మహర్షి చనిపోయిన గోవును అభిషేకించాడు. గోవు బ్రతికింది. గౌతముడు గోహత్యా దోషంనుండి విముక్తుడయ్యాడు. ఇట్లా పడమటి కనుమల్లో బ్రహ్మగిరిమీద వెలసిన గంగ గోవును బ్రతికించి 'గోదావరి' అయింది. గౌతమ మహర్షి ప్రయత్న ఫలితంగా భూమిమీద వెలసింది కాబట్టి 'గౌతమీ గంగ' అయింది.

గోదావరి-భాషాశాస్త్రం

గోదావరి అన్న పదం సంస్కృతం అయితే దానికి నీటిని ఇచ్చేది లేక గోవులను ఇచ్చేది అని అర్థం. కాని

కొందరు భాషావేత్తలు ఇది తెలుగు పదమే అంటున్నారు. ఇది 'గోద' లేక 'గోదె' అన్న ప్రాచీన ద్రావిడ భాషా పదము లేక తెలుగు భాషా పదమంటున్నారు. దీని కర్థం పొలిమేర లేక ఎల్ల. తరువాత కాలంలో సంస్కృతీకరణం జరిగి 'గోదావరి' అయింది. దక్షిణా పథంలోని ఉత్తర దక్షిణ ప్రాంతాలను వేరుచేసే 'గోద' (ఎల్ల)గా ఉండడంవల్ల దీనికా పేరు వచ్చిందని వీరి అభిప్రాయం.

నేటి గోదావరి గమనం-
సహ్యాద్రులనుండి సాగర పర్యంతం

కవి సార్వభౌముడైన శ్రీనాథుడు గోదావరి గమనాన్ని చక్కని భౌగోళిక పరిజ్ఞానంతో భీమేశ్వర పురాణంలో ఇట్లా వర్ణించాడు.

సీ. త్ర్యంబకాచల శిఖాగ్రమునందు నుదయించి
పొదిలి యార్యావర్త భూమిఁదఱిసి
మలగి దండక వనీ మధ్యభాగమున నా
ప్రస్రవణాచల ప్రస్థ మొఱసి
పట్టిస శ్రీ వీరభద్రేశు సేవించి
తీరసోమేశు మందిరము డాసి
యేచి యనంత భోగేశ్వర స్థానంబు
రుద్ర పాదములపైఁ ద్రోవగాగ
తే. గోటి పల్లీశు కోమలాంఘ్రులకు మ్రొక్కి
కుండలాముఖ తీర్థంబు గుస్తరించి
భీమ మండలి డాపలఁ బెట్టుకొనుచు
గౌతమీ గంగ లవణాబ్ధి గౌగలించె.

సహ్యాద్రుల్లోని శైవ పుణ్యక్షేత్రం త్ర్యంబకేశ్వరానికి వెనుక ఉన్న కొండలోని ఒక చలమ గోదావరి జన్మస్థలం. ఈ స్రోతస్సునుండి బయలు దేరిన గోదావరి త్ర్యంబకంలో ఒక గోవిగ్రహం నోటి నుండి బిందురూపంలో వెలువడుతుంది. కుశావర్తమనే కుండంలో ప్రోగై ముందుకు సాగుతుంది. త్ర్యంబకాన్ని దాటి గోదావరి పర్వత శిఖర ప్రాంతశిలామయ పీఠ భూమిలో కొంత దూరం ప్రవహించి గంగాపూర్ జలపాతంగా గంతువేసింది. ఇంకా కొంత ముందుకుపోయి నాసిక్ పట్టణాన్ని చేరుతుంది. సీతారాముల ప్రవాసం వల్ల పవిత్రమైన పంచవటి ఇదేనని ప్రసిద్ధి. అక్కడ నుండి యాత్రికులు మునిగే అనేక కుండాల ద్వారా ప్రవహించి ప్రతిష్ఠాన పురాన్ని చేరుతుంది. ఇది ఒకప్పటి ఆంధ్ర శాతవాహనుల రాజధాని. ఏకనాథుడు మొదలైన మహారాష్ట్ర భక్తులకు నెలవు. గోదావరి ప్రతిష్ఠానాన్ని చేరే సరికే దారిలో దర్నా, ప్రవర, మూలా, కద్రవ అనే ఉపనదులు కలుసుకుంటాయి. ప్రతిష్ఠానం వరకూ గోదావరి ప్రవహించిన భూమి సముద్రమట్టానికి పదహారువందల అడుగుల ఎత్తైన పీఠభూమి. అక్కడి నుండి సముద్ర మట్టానికి 700 అడుగుల ఎత్తున్న సమతల భూమి మీద నడక సాగిస్తుంది. కుడి నుండి పూర్ణ, ఎడమ నుండి మంజీరా, వంజీరా నదులు వచ్చి చేరగా తనలో కలుపుకొని తెలుగు దేశంలో అడుగు పెడుతుంది గోదావరి. ఆదిలాబాదు జిల్లాలోని సరస్వతీక్షేత్ర మైన బాసర దగ్గర గోదావరి తెలుగు దేశం ప్రవేశిస్తుంది. నిజామాబాద్ జిల్లా సరిహద్దులో మంజీర గోదావరిలో కలుస్తుంది. అక్కడినుండి కొంతదూరం ఆదిలాబాదు, నిజామాబాదు జిల్లా

లకు సరిహద్దుగాను, మరికొంత దూరం ఆదిలాబాదు, కరీంనగర్ జిల్లాలకు సరిహద్దుగాను ప్రయాణిస్తుంది. మధ్యప్రదేశ్ నుండి కడెంనది, పెన్గంగా, వరదా, వైగంగల సమన్వయమైన ప్రాణహితానది వచ్చి ఆదిలాబాదు జిల్లాలో గోదావరితో కలుస్తాయి. మరి కొంతదూరం ముందుకు సాగింతర్వాత కరీంనగర్ జిల్లా తూర్పు అంచున ఇంద్రావతీనది వచ్చి చేరుతుంది. అక్కడి నుండి ఆగ్నేయ దిశగా తిరిగి వరంగల్లు అల్లంత దూరంలో భద్రాచలరాముని దర్శనార్థమై గోదావరి ప్రయాణం సాగిస్తుంది. భద్రాచలంలోనే కిన్నెరసాని వచ్చి కలుస్తుంది. అక్కడి నుండి ముందుకు సాగి దారిలో కూనవరం వద్ద రామభక్తురాలైన శబరిని తనలో కలుపుకొని తూర్పు కనుమల్లో ఒక భాగమైన పాపికొండలలోనికి చొచ్చుకొని పోతుంది. ఇంత వరకు గోదావరి ప్రవహించిన ప్రాంతం అరణ్యమయం, పర్వతమయం. పాపికొండలలో గోదావరి ఉరుకులు పరుగులతో ప్రవహిస్తుంది, ఈ ప్రదేశం నయనాభిరామమైన ప్రకృతి సౌందర్యానికి నిలయం. రెండువందల నుండి మూడువందల మీటర్ల వెడల్పు లోయలో ప్రవేశించిన గోదావరి ఈ ఇరుకైన పాపికొండలోయలో సుమారు పదిహేను కిలోమీటర్లు ప్రవహిస్తుంది. కనుమకు దిగువన ముప్పై కిలోమీటర్ల దూరాన 1.6 కిలోమీటర్ల విస్తృతితో పోలవరం దగ్గర మైదానంలో అడుగు పెడుతుంది. అక్కడి నుండి గోదావరి వేగం తగ్గుతుంది. వరదలు లేనిసమయంలో కనుమలో గోదావరిలోతు ముప్పై నుండి అరవై మీటర్ల వరకు ఉంటుది. వరదల సమయంలో తొంభై మీటర్ల వరకు ఉంటుంది. గోదావరి ఈ పాపి కొండల్లో ఎన్నో మలుపులు తిరు

గుతూ ప్రవహించడం వల్ల అందమైన సరస్సులు రెండు వైపులా ఏర్పడ్డాయి. లోయలో నీరు అతివేగంగా ప్రవహిస్తుంది. లాంచీలు, స్టీమర్లు, పడవలు ఈ లోయలో చాలా జాగ్రత్తగా ప్రయాణం చేయవలసి ఉంటుంది.

పోలవరం వద్ద మైదానంలో ప్రవేశించిన గోదావరి అలస గమనంతో తన పేరున వెలసిన తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలకు సరిహద్దుగా ప్రవహించి పోలవరానికి ముప్పై కిలోమీటర్ల దిగువన రాజమహేంద్రవరాన్ని (రాజమండ్రి) చేరుతుంది. ఇక్కడ గోదావరి వెడల్పు మూడు కిలోమీటర్లు. మరికొంత ముందుకు సాగి ధవళేశ్వరం చేరేటప్పటికి గోదావరి వెడల్పు ఆరు కిలోమీటర్లవుతుంది. ఇంత విశాలం కావడానికి కారణం నదిమధ్య ఏర్పడ్డ మూడు లంకలు. ఎడమవైపున ఉన్నది పిచ్చికల లంక. మధ్యన ఉన్నది బొబ్బర లంక. ఇదే కోనసీమ డెల్టాకు ప్రారంభం. కుడివైపున ఉన్నది మద్దూరు లంక.

రాజమండ్రినుండి ధవళేశ్వరం వరకూ విశాలవాహినియై ప్రవహించిన గోదావరి ధవళేశ్వరంవద్ద ఏడు పాయలుగా చీలి సప్తగోదావరి అవుతున్నది. కాని సప్తఋషుల పేర్లు ధరించిన ఈ ఏడు పాయలు ఈనాడు కనిపించవు. ధవళేశ్వరానికి దిగువన అఖండ గోదావరి వశిష్ఠ గోదావరి, గౌతమీ గోదావరి అని రెండు పాయలుగా చీలడం మాత్రమే మనకు కనిపిస్తుంది. మిగిలిన పాయలు అంతర్వాహినులై ఉండవచ్చు. వీటిలో గౌతమీగోదావరి తూర్పుగా డెబ్బైఅయిదు కిలోమీటర్లు ప్రవహించి వృద్ధ గౌతమి, కోరింగనది అని మరిరెండు పాయలుగా

చీలింది. వశిష్ఠ దక్షిణ దిక్కుగా ఎనభై అయిదు కిలోమీటర్లు ప్రవహిస్తుంది. వీటిలో వృద్ధగౌతమి యానాం దగ్గర, వశిష్ఠ నరసాపురం దగ్గర సముద్రంలో కలుస్తున్నాయి. వశిష్ఠనుండి వైనతేయం అనే పాయ చీలి సముద్రంలో కలుస్తున్నది. గౌతమీ గోదావరికి, వశిష్ఠ గోదావరికి ఏర్పడ్డ పాయలతో కలిపి గోదావరి సప్తగోదావరి అని పిలవడంకూడా ఉంది. ధవళేశ్వరం నుండి సముద్రం అరవై నాలుగు కిలోమీటర్లు. ఈ విధంగా తన జన్మస్థానమైన త్ర్యంబకంనుండి బయల్దేరి తను పుట్టిన దేశమైన మహారాష్ట్రలో ఏడువందల ఎనభై కిలోమీటర్లు, తను మెట్టిన దేశమైన ఆంధ్రప్రదేశ్‌లో ఏడువందల ఇరవై కిలోమీటర్లు ప్రవహించి గోదావరి సముద్రునిలో ఐక్యమవుతున్నది.

గోదావరి-నేటి జీవనం

నదులు జీవనాధారాలు. వీటిని లోకోపకారానికి ఉపయోగించేందుకు నాగరికతా పరిణామంలో మానవుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు, చేస్తున్నాడు. భారతదేశ చరిత్రను పరిశీలిస్తే ప్రాచీన, మధ్య యుగాలలో ఇటువంటి ప్రయత్నాలెన్నో కనిపిస్తాయి. ఇప్పటికి ఐదువేల సంవత్సరాలకిందట క్రీ.పూ. మూడువేల ప్రాంతంలో సింధులోయ నాగరికతా నిర్మాతలు, తమ స్నానంకోసం నిర్మించుకున్న మహాకాసారాన్ని వాస్తుశాస్త్రజ్ఞులు అద్భుతమైన కట్టడమని వర్ణించారు. క్రీ. పూ. నాలుగో శతాబ్దంలో మౌర్య చంద్రగుప్తుడు వ్యవసాయాభివృద్ధికోసం సౌరాష్ట్రంలోని గిర్నార్ దగ్గర 'సుదర్శన'మనే మహాసరస్సును నిర్మించాడు. ఒక పెద్ద తుఫాను వచ్చి క్రీ. శ. రెండో శతాబ్దిలో

ఈ సరస్సు దెబ్బతిన్నది. అప్పుడు గుజరాతును పరిపాలిస్తున్న శకరాజు రుద్రదాముడు దీన్ని బాగుచేయించాడు. మౌర్యచంద్ర గుప్తుని కంటే ముందు నందరాజులు కళింగంలో ఒక కాలువను త్రవ్వించారు. క్రీ. పూ. రెండో శతాబ్దంలో కళింగాన్ని పరిపాలించిన ఖారవేల చక్రవర్తి ఈ కాలువను తన రాజధాని వరకు పొడిగించి మంచినీటి సౌకర్యాన్ని కలిగించాడు. మధ్యయుగంలో ఆంధ్రదేశంలో కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర చక్రవర్తులు వ్యవసాయాభివృద్ధికోసం సాగరాలు, సముద్రాలు అన్న పేరిట పెద్ద చెరువులను నిర్మించారు. వీటివల్ల రాజ్యసంపద విస్తారంగా అభివృద్ధి చెందింది. తెలంగాణాలో కాకతి గణపతి దేవుని కాలంలో పాకాల, రామప్ప చెరువుల నిర్మాణం జరిగింది. ఎంతో వైశాల్యం ఉన్న ఈ చెరువులు చాలా ప్రసిద్ధమైనవి. ప్రస్తుతం నెల్లూరులో ఉన్న స్వర్ణాల చెరువు కూడా గణపతి దేవుడు నిర్మించిందే. కొండవీటి రెడ్డిరాజుల్లో సుప్రసిద్ధుడైన పెదకోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక 'సంతానసాగర'మనే చెరువును తవ్వించింది. ఆమె కుమారుడు కొండవీటిరెడ్డి రాజుల్లో చివరివాడయిన రాచవేమారెడ్డి ఈ సంతానసాగరానికి 'జగనొబ్బ గండ' అనే కాలువను తవ్వించాడు. రాజులే కాక సామంతులు, మంత్రులు, అధికారులు కూడా చెరువులు తవ్వించారు. విజయనగర రాజుల కాలంలో దక్షిణ భారతదేశంలో, ప్రత్యేకించి తెలుగుదేశంలో వెలసిన తటాకాలెన్నో ఉన్నాయి. మానవునికి నీటి అవసరాన్ని గుర్తించిన మన పూర్వీకులు తటాక నిర్మాణాన్ని సప్తసంతానాలలో ఒకటిగా పేర్కొన్నారు. అంతేగాక తటాక నిర్మాణపద్ధతులను తెలిపే వివరాలను శాసనాలకెక్కించారు.

విజయనగర రాజకుమారుడైన భాస్కర భవదూరుని పోరుమామిళ్ళ తటాక (కడపజిల్లా) శాసనం తటాక నిర్మాణ వాస్తువును గురించి ఎన్నో విశేషాలు తెల్పుతున్నది. మధ్య యుగంలో జలాధారాలను ఏర్పరచుకోవడానికి మన పూర్వులు ఎన్నో మార్గాలవలంబించారు. బుద్ధి నేర్పు ఉంటే అసాధ్యమేమీ ఉండదు. బుద్ధినేర్పుతో మన పూర్వీకులు చేసిన ప్రయత్నాలను కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో ఇట్లా వర్ణించాడు.

ఈ యెడఁ గర్మభూమియగు డెవ్వరికైనను బుద్ధి నేర్పునన్
జేయఁగ లేదు కాల మెసఁజేసిన నేతములెత్తి కాల్వలుం
బాయలుఁ గోళ్ళు నూతులును బావులు రాట్నములున్ జలార్థమై
చేయఁగనా యెఁగాక మఱి చేయని నాఁడవి తామెపుట్టునా.

ఇట్లాగే హరివంశంలో ఎఱ్ఱన "కొండల కాలువలడ్డ కట్టుదురు నీరికి" అని చెప్పాడు.

ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం విస్తారంగా అభివృద్ధి చెందింది. ఈ విజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఇంజనీర్లు నదులకు ఆనకట్టలు కట్టి బ్రహ్మాండమైన జలాశయాలను నిర్మిస్తున్నారు. వీటిద్వారా మానవునికి నీరు, ఆహారాల కొరత లేకుండా చేసే ప్రయత్నం జరుగుతున్నది. ఇంతేగాక నదీ జలపాతాలనూ, కొత్తగా నిర్మించిన ఆనకట్టలవల్ల ఏర్పడే కృత్రిమ జలపాతాలనూ విద్యుచ్ఛక్తి తయారు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఈ విద్యుచ్ఛక్తి దేశాన్ని పారిశ్రామికీకరణం చేయడానికీ, కాంతిభరితం చేయడానికీ ఉపయోగపడుతున్నది. ఆధునిక యుగంలో 19, 20 శతాబ్దాలలో గోదావరి నదిమీద ఎన్నో

జలాశయాలు, విద్యుదుత్పాదక కేంద్రాలు నెలకొన్నాయి. వీటిలో ఏ ఒకటో, రెండో తప్ప మిగిలినవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. భౌగోళిక పరిసరాలు, ప్రయోజనాలే ఇందుకు కారణం.

గోదావరి పొడవు పదిహేనువందల కిలోమీటర్లు. బ్రహ్మ పురాణం, గౌతమ పురాణం కూడా గోదావరి పొడుగు రెండు వందల యోజనాలని చెప్తున్నాయి.

శ్లో॥ తిస్రః కోట్యర్థకశ్చైవ యోజనానాం శతద్వయే
తీర్థాని ముని శార్దూల సంభవిష్యతి గౌతమీ.

యోజనం అంటే ఏడున్నర కిలోమీటర్లు. గోదావరీ పరీవాహ ప్రాంతం 3.15 లక్షల చదరపు కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి ప్రవహించిన దూరం ఏడువందల ఇరవై కిలోమీటర్లు. పరీవాహ ప్రాంతం 90,650 చదరపు కిలోమీటర్లు. గోదావరి దక్షిణ భారతదేశంలో ప్రవహించే నదులన్నిటిలో పెద్దది.

జాయక్వాడి ప్రాజెక్టు

గోదావరి నదిమీద మహారాష్ట్రలో నిర్మించిన ప్రాజెక్టుల్లో మొదట చెప్పదగింది జాయక్వాడి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును మొట్ట మొదట సంకల్పించింది శ్రీ యం. సి. నరలవాడే గారు. మహా రాష్ట్రలో ఔరంగాబాదు జిల్లాలో ఈ ప్రాజెక్టు నిర్మాణం ఇంకా కొనసాగుతున్నది. రెండు దశలలో నిర్మించాలని తలపెట్టిన ఈ ప్రాజెక్టువల్ల మూడు లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. మొదటి దశలో పైఠాన్ వద్ద గోదావరిమీద 37 మీటర్ల

ఎత్తు అడ్డకట్ట కట్టారు. దీన్ని కొంత మట్టితోను, కొంత సిమ్మెంటుతోను నిర్మించారు. దీని పొడవు 10,002 మీటర్లు. ఈ ఆడ్డకట్టవల్ల ఏర్పడిన జలాశయంనుండి ఎడమవైపున నూట ఎనభై అయిదు కిలోమీటర్ల కాలువ 1.42 లక్షల హెక్టార్ల భూమిని సాగుచేయడానికి నీటిని అందిస్తుంది. దీనినుండి పన్నెండు మెగావాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పన్నమౌతుంది. 1975-76 నాటికి 54,000 హెక్టార్ల భూమిని సాగులోకి తెచ్చే వసతి ఏర్పడింది. ఈ ప్రాజెక్టు 1956 లో పెద్ద ఎత్తున ప్రారంభించ బడింది. 1964 లో ప్రణాళికా సంఘం (ప్లానింగ్ కమిషన్) ఈ ప్రాజెక్టును ఆమోదించింది. 1974 లో 74.36 కోట్ల రూపాయల ఖర్చుతో మొదటి దశ పూర్తి అయింది.

ఇటీవలే ఈ ప్రాజెక్టు రెండవ దశను ఆమోదించారు. పైఠాన్‌కు దిగువన నూట ఇరవై కిలోమీటర్ల దూరంలో గోదావరి ఉపనది సింధుపురామీద ఆనకట్టను నిర్మిస్తారు. ఈ ఆనకట్ట 30.5 మీటర్ల ఎత్తు, 60,090 మీటర్ల పొడుగూ ఉంటుంది. ఇక్కడ ఏర్పడే జలాశయం నుండి కుడివైపుకు నూటముప్పై మూడు కిలోమీటర్ల పారుదల కాలువను తవ్వుతారు. రెండవ దశ పూర్తిఅయితే 1.36 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. దీనికి 78.25 కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది.

మొత్తం ఈ ప్రాజెక్టువల్ల సాగులోకి వచ్చే 2.78 లక్షల హెక్టార్ల భూమిలో 1979-80 నాటికి 1,00,700 హెక్టార్ల భూమిని సాగులోకి తెచ్చే వసతిని కల్పించారు.

పోచంపాడు ప్రాజెక్టు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పూర్తికావలసిన బృహత్తర పథకాలలో పోచంపాడు ప్రాజెక్టు మొదట చెప్పదగినది. తెలంగాణాలో కరీంనగర్, నిజామాబాదు జిల్లాలలో వ్యవసాయాభివృద్ధి ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యేనాటికి అయిదు లక్షల డెబ్బైవేల ఎకరాల ఆయకట్టుభూమి సాగులోకి వస్తుంది. ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఋణసహాయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. దీనికి నూటఎనభై కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. 1963 జులైలో జవహరాల్ నెహ్రూ దీనికి శంకుస్థాపన చేశారు.

గోదావరి నది సముద్రానికి 615 కిలోమీటర్ల దూరంలో, మహారాష్ట్రలో సుమారు 665 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పొలిమేరలో అడుగుపెడుతున్నది. ఈ పొలిమేరకు ఏడు కిలోమీటర్ల ఎగువన మంజీర గోదావరిలో కలుస్తుంది. అక్కడినుండి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ తాలూకాలోని పోచంపాడును మందగమనంతో చేరుతుంది. పోచంపాడు ఆనకట్ట గోదావరిలో సుధా ఉపనది కలిసే చోటికి ఇరవై కిలోమీటర్ల దిగువన, సోన్ బ్రిడ్జికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాదు-నాగపూర్ జాతీయ రహదారిమీద రెండువందల పదో కిలోమీటర్ దగ్గర, పోచంపాడు గ్రామానికి ఆరు కిలోమీటర్లు నది ఎగువన ఈ ఆనకట్ట ఉంది.

పోచంపాడు ఆనకట్ట పొడుగు 812 మీటర్లు. ఎత్తు నలభై మూడు మీటర్లు. ఈ ఆనకట్టకు కుడి వైపు గట్టు నుండి

నూట పదమూడు కిలోమీటర్ల కాలువను తవ్వుతారు. ఈ కాలువ నిజామాబాదు జిల్లాలో ముప్పై కిలో మీటర్లు, కరీంనగర్ జిల్లాలో ఎనభై మూడు కిలో మీటర్లు ప్రవహిస్తుంది. దీని వల్ల ఈ రెండు జిల్లాల్లో 2.3 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. ఈ భూములమీద ఏడాదికి యాభై నుండి అరవై లక్షల రూపాయలదాకా శిస్తు వసూలవుతుంది. 1979-80 నాటికి 1.76 లక్షల హెక్టారుల భూమిని సాగులోకి తెచ్చే వసతి కల్పించారు.

కడెం ప్రాజెక్టు

ఆదిలాబాదు జిల్లాలో వ్యవసాయ ప్రయోజనాలకోసం గోదావరి ఉపనది కడెంమీద ఈ ప్రాజెక్టు నిర్మించారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజామాబాదు జిల్లా అచ్చంపేట దగ్గర గోదావరి ఉపనది మంజీర మీద నిజాంసాగర్ ప్రాజెక్టు ఉంది. ఇది నిజాం ప్రభుత్వకాలంలో 1924లో మొదలై 1931లో పూర్తయింది. ఈ ప్రాజెక్టు కింద 2.75 లక్షల ఎకరాలభూమి సాగుజరుగుతుందని అంచనా. ఈ అడ్డకట్ట అనేక కొండలను కలుపుతుంది. పొడవు సుమారు రెండు కిలోమీటర్లు. వెడల్పు 914 అడుగులు. దీనిమీద రోడ్డువేసి రవాణా సౌకర్యాలకు ఉపయోగిస్తున్నారు. నిజాంసాగర్ నుండి కాలువలు తవ్వి అలీసాగర్, మసానిగుప్త సరస్సులలోకి నీరుపోయే ఏర్పాటు చేశారు. తర్వాత యాభయి రెండు పిల్లకాలువలద్వారా నీటివనరులు సమకూర్చారు.

ఈఆనకట్ట పై భాగంలో పెద్దకాలువ తవ్వారు. దీని వెడల్పు 100 అడుగులు, లోతు 10.5 అడుగులు. ఇందులోని నీళ్ళు 354 గ్రామాల్లోని రెండులక్షల ఎకరాలభూమి సాగుకు సరిపోతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అయిన ఖర్చు రెండుకోట్ల రూపాయలు.

నిజాంసాగర్ ప్రాజెక్టు 'రీమాడలింగ్'-సింగూరుప్రాజెక్టు

కాలక్రమంలో నిజాంసాగర్ రిజర్వాయరులో పూడిక ఏర్పడింది. నీటి నిల్వ తగ్గిపోయింది. ఆయకట్టుకు సేద్యపునీరు సక్రమంగా అందడంలేదు. అందువల్ల నిజాంసాగర్ రీమాడలింగ్ స్కీమ్ కింద ఆనకట్ట ఎత్తును నాలుగడుగులు పెంచడానికి, దాని ద్వారా అదనంగా 5.1 శతకోటి ఘనపుటడుగుల నీటిని నిల్వ చేయడానికీ ప్రయత్నం జరిగింది. ఇదివరలో దేవనూరు ప్రాజెక్టును రూపొందించి విరమించుకున్నారు. దీనికి కారణం బచావత్ అవార్డు. ఈ అవార్డు గోదావరీ జలాల పంపకానికి సంబంధించింది. దేవనూరు ప్రాజెక్టుకు బదులుగా ఇప్పుడు మెదక్‌జిల్లాలోని ఆంథోల్ తాలూకా సింగూరు వద్ద ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ సింగూరు రిజర్వాయరుకు ముప్ఫై శతకోటి ఘనపుటడుగుల నీటిని నిలువచేసే శక్తి ఉంటుంది. ఇది నిజాంసాగర్‌కు వచ్చే పూడికమట్టిని ఆపివేస్తుంది. హైదరాబాదు - సికిందరాబాదు జంటనగరాలకు మంచినీటి సరఫరాకోసం నిజాం. సాగర్‌కు అదనంగా నీటిని అందిస్తుంది. అంతేగాక ఇప్పుడు పారుదలలో ఉన్న ఆయకట్టు ప్రాంతానికి సక్రమంగా నీటిని అందజేయడానికి వీలవుతుంది. పని ప్రారంభమయినప్పటినుంచీ 1975–76 వరకూ ఈ ప్రాజెక్టుకు 3.72 కోట్లరూపాయలు

ఖర్చయింది. 1976–77లో రెండుకోట్ల రూపాయలు కేటాయించారు. మొత్తం పదకొండుకోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా.

సింగూరు ప్రాజెక్టు మట్టికట్టుపం పొడవు 7,800 మీటర్లు, ఎత్తు 23 మీటర్లు. ఆనకట్టమీద వెడల్పు అయిదు మీటర్లు. 164 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నీరు నిలువ ఉంటుంది. మంచినీటిని అందించటానికి గొట్టాల నిర్మాణంతోసహా మొత్తం అరవై అయిదు కోట్లు ఖర్చవుతుందని అంచనావేశారు.

నిజాంసాగర్ విద్యుదుత్పత్తి పథకంకింద మొదటి ప్రణాళికా కాలంలో 5,000 కిలోవాట్ల విద్యుత్తును ఇవ్వగల మూడు యూనిట్లను 1956 లో ప్రారంభించారు.

పోచారం ప్రాజెక్టు

నిజాం ప్రభుత్వకాలంలోనే పూర్తయిన ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఇది మెదక్, నిజామాబాదుజిల్లా సరిహద్దుల్లో ఉన్న పోచారం గ్రామంవద్ద ఉంది. ఈ ప్రాజెక్టు ఎల్లారెడ్డి తాలూకాలోని భూములకు సేద్యపునీటిని అందిస్తున్నది.

ముచికుంద జలవిద్యుత్పథకం - ఎగువసీలేరు, దిగువసీలేరు పథకం

ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలు కలిసి ఈ జలవిద్యుత్ కేంద్ర పథకాన్ని రూపొందించాయి. గోదావరికి ఉపనది అయిన ముచికుంద ఈ రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఈ ప్రాజెక్టు

నిర్మాణానికయ్యే ఖర్చును ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలు 70:30 నిష్పత్తిలో భరిస్తాయి. విద్యుచ్ఛక్తి వాడకంకూడా అదే నిష్పత్తిలో ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు 22.92 కోట్ల రూపాయలు ఖర్చయింది. దీనినుండి 1,14,750 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తున్నది.

గోదావరికి శబరి ఉపనది. ఈ శబరికి సీలేరు ఉపనది. సీలేరు నదిమీద ఎగువ సీలేరు, దిగువ సీలేరు జలవిద్యుదుత్పాదక కేంద్రాలను నిర్మిస్తున్నారు. తడికవాగు, సీలేరు కలిసేచోట ఉన్న 198 మీటర్ల జలపాతం ఆధారంగా దిగువ సీలేరు విద్యుదుత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఎగువసీలేరు ప్రాజెక్టు విశాఖపట్టణం జిల్లా చింతపల్లికి డెబ్బైకిలోమీటర్ల దూరంలో ఉంది, దిగువసీలేరు కేంద్రం ఆరువందల మెగావాట్ల విద్యుచ్ఛక్తిని, ఎగువసీలేరు నూటఇరవై మెగావాట్ల విద్యుచ్ఛక్తిని అందిస్తాయి.

గోదావరి ఆనకట్ట — గోదావరి బ్యారేజి

ఒకనాడు కరువుకాటకాలకు నిలయమైన గోదావరి మండలాన్ని ఆంధ్రదేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కు దక్కుతుంది. ఒకవైపు ధవళేశ్వరం, మరోవైపు విజ్జేశ్వరాన్ని కలుపుతూ మధ్యలో ఉన్న లంకల మీదగా నాలుగు కిలోమీటర్ల ఆనకట్టను కట్టి గోదావరి మండలాన్ని సస్యశ్యామలం చేశాడు సర్ ఆర్థర్ కాటన్. ఈ ఆనకట్ట నిర్మాణం 1847లో మొదలై 1852లో పూర్తయింది. మొదట 1.75 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది. 1887 నాటికి

3.21 లక్షల హెక్టార్లభూమి సాగులోకి వచ్చింది. ఆ తర్వాత తలుపులు మొదలైనవి బిగించడంతో సాగులోకి వచ్చిన భూమి ఇప్పటి 4.04 లక్షల హెక్టార్లు.

135 సంవత్సరాల కింద నిర్మించిన ఈ అనకట్ట అనేక కారణాలవల్ల దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త అనకట్టను నిర్మించాలని 1969 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కొత్త అనకట్టనే గోదావరి బ్యారేజ్ అంటున్నారు. 1965 లో భారత ప్రభుత్వం నియమించిన మిత్రాకమిటీ అనే నిపుణుల బృందం పాత అనకట్టకు నలభై మీటర్ల ఎగువన కొత్త అనకట్టను నిర్మించాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసును అనుసరించి 26.59 కోట్ల అంచనా వ్యయంతో 1969 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టును ఆమోదించింది. 1970 లో పని మొదలైంది. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలినన్ని నిధులు కేటాయించనందు వల్ల పని నత్తనడకతో సాగి 1977 నాటికి పూర్తి కావలసిన నిర్మాణం వెనకపడిపోయింది. 1975 లో ప్రపంచ బ్యాంకు బ్యారేజీ కయ్యే ఖర్చు ఆనాటికి అరవై కోట్లని అంచనావేసి 36 కోట్ల రూపాయల ఋణాన్ని మంజూరు చేసింది.

1976 జులై 7/8 నాటి అర్ధరాత్రి కాటన్ నిర్మించిన ధవళేశ్వరం అనకట్టలో 147 మీటర్ల గండి పడింది. తూర్పు కాలువకు నీరు సరఫరా చేసే వీలులేక 1.11 లక్షల హెక్టార్ల సాగు నిలిచిపోయింది. అంతేగాక కొన్ని లక్షల ప్రజలకు, పశువులకు త్రాగే నీరు కరువయింది. ఈ ధవళేశ్వరం అనకట్ట దెబ్బ

తినడంతో ప్రభుత్వం గోదావరి బ్యారేజీ సమర సన్నాహంతో పూర్తి చేయాలని నిశ్చయించింది.

గోదావరి బ్యారేజిలో నాలుగు విభాగాలున్నాయి. ఈ నాలుగు విభాగాలు నాలుగు గ్రామాలవద్ద ఉన్నాయి. వాటి వివరాలు-

ధవళేశ్వరం	1280 మీటర్లు
ర్యాలి	786 మీటర్లు
మద్దూరు	421 మీటర్లు
విజ్జేశ్వరం	713 మీటర్లు

99,000 క్యూబిక్ మీటర్ల వరదనీటి తాకిడికి ఆగి రెండు వందల సంవత్సరాలవరకు పటిష్ఠంగా ఉండేటట్లు ఈ బ్యారేజీని నిర్మించారు. ఆనకట్టకింద గోదావరీనది శాఖలు గౌతమి, వసిష్ఠా నదులున్నాయి. వీటిలోనికి వదిలే నీటిని క్రమబద్ధం చేయడానికి 18.29X3.35 మీటర్ల కలుజు ద్వారాల్ని అమర్చారు. బ్యారేజి మీద 7.5 మీటర్ల వెడల్పైన రోడ్డుబ్రిడ్జి ఉంది. ఈ బ్యారేజి నిర్మాణానికి మొదట్లో వేసిన ఖర్చు అంచనా 26.59 కోట్లు. పూర్తయ్యేనాటికి అయిన ఖర్చు ఎనభై కోట్లు. ఈ గోదావరి బ్యారేజికి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి అని పేరు పెట్టాలని ప్రజల కోరిక.

పోలవరం ప్రాజెక్టు

ఆంధ్రులు నలభై ఏండ్లుగా కలలు కంటున్న ఒక బృహత్తర పథకం పోలవరం ప్రాజెక్టు. కాని అది నేటికీ కలగానే

ఉండిపోయింది. విశాఖపట్నానికి మంచినీటి ఎద్దడి తీర్చడానికీ, కోస్తా జిల్లాల్లో లక్షలాది ఎకరాల్ని సస్యశ్యామలం చేయడానికీ ప్రఖ్యాత ఇంజనీరు శాంతి రామమూర్తిగారు సలభై యేండ్ల కిందట ఈ ప్రాజెక్టును రూపొందించారు. దీనికి శ్రీరామపాద సాగర్ అని పేరు పెట్టారు. ఈ బ్యారేజీని పోలవరం సమీపంలో కట్టాలని నిర్ణయించారు. తర్వాత అనేక కారణాలవల్ల ప్రభుత్వం ఈ శ్రీరామపాదసాగర్ ప్రాజెక్టు బదులుగా పోలవరం బ్యారేజీని తలపెట్టింది. ఈ ప్రాజెక్టు నివేదికను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1978 లో సెంట్రల్ వాటర్ కమిషన్ ఆమోదంకోసం పంపించింది. ప్రాజెక్టు రిపోర్టుపైన కమిషన్‌కు వచ్చిన కొన్ని అనుమానాలవల్ల నేటికీ ఆమోదముద్ర లభించలేదు. నిరుటి అంచనా ప్రకారం ఈ ప్రాజెక్టుకు అయ్యేఖర్చు వెయ్యికోట్ల రూపాయలు. కాని ఆరో ప్రణాళికలో దీనికోసం కేటాయించింది 5 కోట్లు మాత్రమే. అయినా దీని శంకుస్థాపన మాత్రం 1981 లో ఆర్భాటంగా జరిగింది.

పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే విశాఖపట్నానికి 23 శతకోటి ఘనపుటడుగుల నీరు అందుతుంది. ఉక్కుఫ్యాక్టరీకి పుష్కలంగా నీరు లభిస్తుంది. 80 శతకోటి ఘనపుటడుగుల గోదావరి నీటిని కృష్ణకు మళ్ళించవచ్చు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాలలో ఏడు లక్షల ఎకరాలకు సేద్యపు నీటిని అందించి పసిడిపంటలు పండించవచ్చు. 420 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చు. ఇటువంటి బహుళార్థ సాధక ప్రాజెక్టును, అన్ని అడ్డంకులూ

తొలగించుకొని ఆంధ్రులు త్వరలోనే నిర్మించుకుంటారని ఆకాంక్ష.

కృష్ణానది-నేటి గమనం-
సహ్యాద్రులనుండి సాగర పర్యంతం

దక్షిణ భారతదేశంలోని మిక్కిలి పెద్ద నదుల్లో మొదటిది గోదావరి, రెండోది కృష్ణ. గోదావరీ జలాలు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశాలను పునీతం చేశాయి. కృష్ణానది మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలగుండా 1200 కిలోమీటర్లు ప్రవహించి ఈ మూడు రాష్ట్రాలను పునీతం చేస్తున్నది. ఈ నది పరీవాహ ప్రదేశ వైశాల్యం 2.51 లక్షల చదరపు కిలోమీటర్లు. కోయ్నా, పంచగంగ, దూద్‌గంగ, ఘటప్రభ, మలప్రభ, భీమ, తుంగభద్ర, మూసి, పాలేరు, మునేరు మొదలైనవి చిన్నా, పెద్దా కలిసి పదిహేనున్నాయి.

సహ్యాద్రుల్లో సుమారు 4,500 అడుగుల ఎత్తున ఉన్న ఒక ప్రాచీన మహాదేవాలయం వద్ద ఒక గోముఖాకారంలో ఉన్న రంధ్రం కృష్ణానది జన్మస్థానం. దీనిని అక్కడి ప్రజలు 'కృష్ణాబాయి' అని పిలుస్తారు. ఇది అరేబియా సముద్రానికి 67 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్రలో ఆరోగ్యకేంద్రంగా ప్రసిద్ధిచెందిన మహాబలేశ్వరానికి సమీపంలో ఉంది. ఇక్కడి నుండి కృష్ణానది అతివేగంతో మహారాష్ట్రలోని సతారాజిల్లాలో ఆగ్నేయ మూలగా నూటనలభై అయిదు మైళ్ళు ప్రవహించి, తర్వాత దక్షిణ మహారాష్ట్రగుండా మరో పదిమైళ్ళు సాగి పడమటినుండి వచ్చిన వెణ్ణా (వర్ణ-వెణ్ణ) నదిని తనలో చేర్చు

కుంటుంది. వెణ్ణానది కృష్ణను కలవడంతో రెంటినీ కలిపి కృష్ణవెణ్ణా అనడం జరిగింది. దక్షిణ మహారాష్ట్రలో మరో నూటయాభై మైళ్ళు ప్రవహించి కృష్ణానది కర్ణాటకలో ప్రవేశిస్తుంది. కర్ణాటకలో బెల్గాం, బీజాపూరు, రాయచూరు జిల్లాల గుండా ప్రవహిస్తుంది. దారిలో యేరాల్, వార్ని యా, ఇడ్ గంగా. ఘటప్రభ, మలప్రభ, భీమరథి, తుంగభద్ర మొదలైన ఉపనదులు కృష్ణను చేరుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అడుగు పెట్టేముందు కృష్ణానది షోలాపూర్, రాయచూర్ జిల్లాల అంతర్వేదులలో పడుతున్నది. ఈ రెండు అంతర్వేదులలో షోలాపూర్ అంతర్వేది భీమానది కృష్ణలో కలవడంవల్ల ఏర్పడు తుంది. వాయవ్యమూలనుండి అహమ్మదాబాదు, పూనా, షోలాపూర్ జిల్లాలనుండి వచ్చి భీమరధి కృష్ణను చేరుతుంది. కృష్ణ ఉపనదులన్నిటిలో భీమరధి పెద్దది. ఇక్కడినుండి మరో ఎనభై మైళ్ళ (133 కి.మీ.) ఆగ్నేయ మూలగా ప్రవహించిం తర్వాత, దానికి కుడివైపున నైఋతి దిక్కునుండి వచ్చి సంగం దగ్గర తుంగభద్ర కృష్ణను చేరుతుంది. రాయచూరు అంతర్వేది, ఆంధ్రప్రదేశ్‌లో తుంగభద్ర కృష్ణతో కలయడం వల్ల ఏర్పడుతున్నది. భీమరధి తర్వాత తుంగభద్ర కృష్ణ ఉపనదులలో పెద్దది. తుంగభద్ర కర్ణాటకలోని ఉత్తర పశ్చిమ దిశలనుండీ, బళ్ళారి, కర్నూలు జిల్లాలనుండి పరీవాహజలాన్ని తెచ్చి కృష్ణకు అందిస్తున్నది.

కృష్ణానది మహబూబ్‌నగర్ జిల్లా సంగమేశ్వర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి మూడువందల ఎనభై మైళ్ళు (612 కి.మీ) ప్రవహించి బంగాళాఖాతంలో

కలుస్తుంది. సంగమేశ్వరంనుండి నల్లమలల ప్రక్కన కర్నూలు జిల్లాలోని శ్రీశైలం మీదుగా, మహబూబ్‌నగర్-కర్నూలు, నల్లగొండ-గుంటూరు, గుంటూరు-కృష్ణా జిల్లాల సరిహద్దుగా ప్రవహించి హంసలదీవివద్ద సముద్రంలో కలుస్తుంది. కృష్ణానది పులిచింతలవద్ద మైదానంలో ప్రవేశిస్తుంది. విజయవాడవద్ద ఇంద్రకీలాద్రి కొండలుదాటి డెల్టాలో ప్రవేశిస్తుంది. ఇక్కడికి సముద్రం డెబ్బైరెండు కిలోమీటర్లు. ఇక్కడినుండి అరవై మూడు కిలోమీటర్లు ప్రవహించిన తర్వాత రెండుగా చీలి దివి సీమను ఏర్పరుస్తుంది. పులిగడ్డ కవతల నలభై మూడు కిలో మీటర్లు ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. తుంగభద్ర కృష్ణను చేరిన తర్వాత ఎడమపక్క తెలంగాణానుండి దిండి, పెద్దవాగు, మూసీ ఉపనదులు కృష్ణలో కలుస్తాయి. మూసీనది ఒడ్డునే ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు ఉన్నది. కర్నూలు జిల్లా నల్లమలల్లో పుట్టిన 'భవనాశి' సిద్ధాపురము, ఆత్మకూరు, పెంటకోట, జూటూరు గ్రామాలగుండా ప్రవహించి సంగమేశ్వరంవద్ద కృష్ణను కలుస్తుంది. ఇవిగాక పాలేరు, మునేరు, హంద్రీ, నాగులేరు, చంద్రవంక మొదలైన చిన్ననదులు ఆంధ్రదేశంలో కృష్ణను చేరి దానిని జలసంపన్నను చేస్తున్నాయి. ఈవిధంగా కృష్ణానది తెలంగాణా రాయలసీమలను తన దక్షిణ వామ స్రవంతీ బాహువులతో కౌగిలించి రెండువైపులా నివసించే యావదాంధ్ర ప్రజానీకాన్ని తల్లిలాగా ప్రోచి రక్షిస్తున్నది.

తుంగభద్రతో కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానదీ పరీవాహ వైశాల్యం (Catchment Area) 1.92 లక్షల చదరపు కిలోమీటర్లు.

కృష్ణానది - నేటి జీవనం

కృష్ణానదీ జలాలను మానవ కళ్యాణానికి సద్వినియోగ పరచడంకోసం పూర్వం బ్రిటిషు ప్రభుత్వమూ, స్వాతంత్ర్యం వచ్చినతర్వాత భారత ప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వమూ ఎన్నో పథకాలను చేపట్టాయి.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు

ఇంతవరకు కృష్ణానదిమీద నిర్మించిన, నిర్మిస్తూన్న ఆనకట్టలన్నింటిలోనేగాక, భారతదేశంలోనే ఇటువంటి నిర్మాణాలలో నాగార్జున సాగర్ని ముందు చెప్పుకోవాలి. కృష్ణాజలాల పూర్తి ఉపయోగం కోసం రూపొందించిన పూర్ణపథకం (Integrated Project) లోని నదీలోయ ప్రాజెక్టుల్లో ఇది మొదటిది. ఇది బహుళార్ధసాధక ప్రాజెక్టు. ఇక్కడ కృష్ణానదీ లోయలో ఒకప్పుడు ఇక్ష్వాకుల రాజధాని విజయపురి ఉండినది. ఇక్కడే శాతవాహనుల కాలంలో ఆచార్య నాగార్జునునికి ఆవాసమైన, సర్వవిద్యాసంపన్నమూ, సర్వకళాశోభితమూ అయిన శ్రీపర్వత విహారం ఉండేది. ఆచార్య నాగార్జునుని పేరుతోనే ఈ ప్రాజెక్టును నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని పిలుస్తున్నారు. ఇక్కడ కృష్ణానదిమీద కట్టిన ఆనకట్ట భారతదేశంలోని అత్యున్నతమైన ఆనకట్టలలో రెండవది. పంజాబులోని భాక్రా మొదటిది. నాగార్జునసాగర్ గరిష్ఠ జలగ్రహణశక్తి (Storage Capacity) 9.18 మిలియన్ ఎకరాల అడుగులు. భాక్రా జలగ్రహణశక్తి 7.4 మిలియన్ ఎకరాల అడుగులు మాత్రమే.

నాగార్జునసాగర్ జలగ్రహణశక్తి విషయంలో దేశంలోని జలాశయాలన్నిటిలో పెద్దది.

ఇక్కడి కృష్ణానదీలోయ చారిత్రాత్మకమైనది. ప్రాజెక్టు నిర్మాణంవల్ల లోయలోని చారిత్రాత్మక పురావస్తు అవశేషాలన్నీ మునిగిపోవలసి వచ్చింది. అందువల్ల పురావస్తు తత్వవేత్తలు ఈ లోయలోని చారిత్రాత్మక అవశేషాలను బయటికితీసి, ముఖ్యమైన కట్టడాల నమూనాలను నిర్మించి కొండమీద వస్తుప్రదర్శనశాలలో భద్రపరచారు. ఈ వస్తుప్రదర్శనశాలను దర్శిస్తే ఈ నదీలోయ గత చారిత్రక వైభవం అర్థమౌతుంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు డిశంబర్ 1955లో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఇది హైదరాబాదుకు నూటనలభై నాల్గు కిలోమీటర్ల దూరంలో నల్లగొండజిల్లా, మిర్యాలగూడా తాలూకాలోని నందికొండ గ్రామంవద్ద ఉన్నది. ఇక్కడి ఆనకట్టను 'గ్రావిటీ డ్యామ్' అంటారు. ఈ ఆనకట్టవల్ల 258 చదరపుమైళ్ళ బృహత్ జలాశయం ఏర్పడింది. ఈ ఆనకట్ట పొడవు 1450 మీటర్లు. పునాదులదగ్గర వెడల్పు 133 మీటర్లు. ఎత్తు 133 మీటర్లు. ఈ గ్రావిటీడ్యామ్ రెండువైపుల నీటి ఒత్తిడిని ఆపడానికి 3,414 మీటర్ల పొడవు, 20.6 మీటర్ల ఎత్తు మట్టికట్టలున్నాయి. ఈ జలాశయంనుండి బయలుదేరే కుడివైపు పారుదల కాలువ పొడవు 276 మైళ్ళు. దీనిపేరు 'జవహర్ కాలువ'. ప్రపంచంలోనే మిక్కిలి పొడవైన పంటకాలువ. ఈ కాలువ జలవాహకశక్తి 21,000 క్యూసెక్కులు. ఇది గుంటూరు, ప్రకాశం,

నెల్లూరు జిల్లాల్లో 21 లక్షల ఎకరాల ఆయకట్టుకు సేద్యపు నీటిని అందించి, ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్నది. ఎడమ వైపు కాలువను 'లాల్‌బహదూర్' కాలువ అంటారు. దీని పొడవు 179 కిలోమీటర్లు. జలవాహక స్తోమత 15,000 క్యూసెక్కులు. ఖమ్మం జిల్లాలో, కృష్ణాజిల్లాలోని తిరువూరు, నూజివీడు, గన్నవరం తాలూకాలలో 13.5 లక్షల ఎకరాల ఆయకట్టు భూమికి ఈ కాలువ నీరందివ్వగలదు. రెండు కాలువలు కలిసి మొత్తంమీద 8.67 లక్షల హెక్టార్ల భూమికి సేద్యపు నీటిని అందిస్తాయి. నాగార్జునసాగర్ కుడికాలువ పెన్నానదితో కలిసి, ప్రస్తుతం నెల్లూరుజిల్లా సోమశిలలో నిర్మాణ మవుతున్న సోమశిల ప్రాజెక్టు వల్ల ఏర్పడే జలాశయాన్ని జల సమృద్ధం చేస్తుంది. 'డ్యామ్' నిర్మాణం పూర్తిఅయింది. కాలువల తవ్వకంలో కొంత మిగిలిఉంది. ఈ కాలువల తవ్వకం తొందరగా పూర్తి చేయడానికి ప్రపంచబ్యాంకు ఋణసహాయం చేసింది. ఇటీవలే (1982 ఆగష్టు) కుడికాలువ నీటిని ప్రకాశం జిల్లాలోని 21 గ్రామాలలో 25,770 ఎకరాలకు పల్లపు సేద్యానికి అందించారు.

1975 నాటికి నాగార్జునసాగర్ నిర్మాణానికి 198.34 కోట్ల రూపాయల ఖర్చయింది. నాగార్జునసాగర్ కింద మొత్తం సాగుకు వచ్చే 8.67 లక్షల హెక్టార్ల భూమిలో 1979-80 నాటికి 6.21 లక్షల హెక్టార్లకు నీరు అంది సాగులోకి వచ్చింది.

కృష్ణ ఆనకట్ట—ప్రకాశం బ్యారేజ్

గోదావరి ఆనకట్ట నిర్మాణంలో ఉన్న సమయంలోనే విజయవాడవద్ద కృష్ణానదిమీద ఆనకట్ట నిర్మాణం 1852లో మొదలై

1855లో పూర్తిఅయింది. డెల్టాలోని తూర్పు, పడమటి భాగాలకు నీటిని అందించడానికి నదికి రెండువైపులా రెండు కాలువలు తవ్వారు. ఆనకట్ట పొడవు ఏడు ఫర్లాంగులు. ఈ ఆనకట్టను రూపొందించిందికూడా సర్ ఆర్థర్ కాటనే. కెప్టెన్ చార్లెస్ ఓర్ అనే ఇంజనీరు దీని నిర్మాణాన్ని పర్యవేక్షించాడు. ఆనకట్ట పూర్తి అయింతర్వాత 5.85 లక్షల ఎకరాలు సాగుకు వస్తాయని అంచనా వేశారు. 1893లో ఈ ఆనకట్ట ఉపరితలాన్ని మూడు అడుగులు పెంచారు. ఆపైన 1923-25 వరకూ అవసరాన్నిబట్టి 'షట్టర్ల'ను మార్చడంద్వారా ఆయకట్టు విస్తీర్ణం 11 లక్షల ఎకరాలకు పెరిగింది. 11,650 చదరపుమైళ్ళ విస్తీర్ణం ఉన్న కృష్ణా తూర్పుడెల్టా కొల్లేరు సరస్సువరకు వ్యాపించి ఉంది. కుడి పార్శ్వంలోని పశ్చిమ డెల్టాకు బకింగ్‌హాం కాలువ నీరు అందిస్తున్నది. ఈ కాలువలు, వీటినుండి చీలిన పిల్లకాలువలు కృష్ణాడెల్టాలో నీటి పారుదలకు, పడవ ప్రయాణానికి, సరకుల రవాణాకి ఎంతో అనుకూలంగా ఉన్నాయి.

1935లో కృష్ణానదికి అడ్డంగా కృష్ణ తూర్పు దరికాలువను దివిసీమకు తీసుకొని పోవడానికి పులిగడ్డవద్ద క్యాంప్‌బెల్ ఆక్విడక్ట్ (క్యాంప్‌బెల్ జలవాహకం)ని నిర్మించారు. దీనిమీద 16 అడుగుల వెడల్పు రహదారి, నాలుగడుగుల వెడల్పు కాలిబాట ఉన్నాయి. దీని నిర్మాణానికి 3.04 కోట్ల రూపాయలు ఖర్చయింది. దీనివల్ల 12 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది.

గోదావరి ఆనకట్టలాగానే కృష్ణానది ఆనకట్టకూడా కాలం గడిచి బలహీనమయింది. దీని స్థానంలో ఆంధ్ర ప్రభుత్వం 1954-58 మధ్య ఒక కొత్త బ్యారేజీని నిర్మించింది. దీనికి స్వాతంత్ర్య యోధుడు, త్యాగధనుడు, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారి పేరు పెట్టడం జరిగింది. ఈ బ్యారేజి మొత్తం పొడవు 4,045 అడుగులు. దీనికయిన మొత్తం వ్యయం 2.81 కోట్ల రూపాయలు.

ప్రకాశం బ్యారేజి నిర్మాణంవల్ల కృష్ణా డెల్టాలో ఒక లక్ష ఎకరాల భూమి అదనంగా సాగులోకి వచ్చింది. మొత్తం మీద 11 లక్షల ఎకరాల ఆయకట్టు మాగాణి సేద్యానికి నీరు లభిస్తున్నది. అంతేగాక ఈ బ్యారేజి మద్రాసు-కలకత్తా నగరాల మధ్య ఉన్న జాతీయ రహదారిని కలపడంలో ప్రాధాన్యం వహిస్తున్నది. కృష్ణానదిమీద వంతెనగా ఏర్పడిన ఈ బ్యారేజీమీద 24 అడుగుల రహదారి, రెండువైపుల అయిదేసి అడుగుల వెడల్పు కాలిత్రోవ ఉన్నాయి.

శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానదిమీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్మిస్తున్న బహూళార్థ సాధక ప్రాజెక్టు-శ్రీశైలం ప్రాజెక్టు. దీనికి అయ్యే ఖర్చు అంచనా నూట ఇరవై ఆరుకోట్ల రూపాయలు. కాని నిర్మాణంలో అపరిమిత జాప్యంవల్ల 1980 నాటికి నిర్మాణ వ్యయం అంచనా రు. 237 కోట్లకు చేరుకొన్నది. కర్నూలు జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలం.

ఇక్కడ లోయలో ప్రవహిస్తున్న కృష్ణానదిని పాతాళగంగ అంటారు. దీనిమీద గ్రావిటీ డ్యామ్ కడుతున్నారు. ఈ డ్యామ్ ఎత్తు 330 అడుగులు. దీనికి తూర్పు దరిన విద్యుదుత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. డ్యామ్ పూర్తి అయితే 770 మెగా వాట్ల విద్యుచ్ఛక్తిని ఈ కేంద్రం అందివ్వగలదు. 1977 నాటికి 440 మెగావాట్ల విద్యుచ్ఛక్తిని ఇవ్వగల నాలుగు యూనిట్లు పని చేయడం ప్రారంభమయింది. తెలంగాణా కృష్ణాతీరాన తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయవలసి ఉన్నది. ఈ యూనిట్ల ద్వారా మొత్తం 1760 మెగావాట్ల విద్యుదుత్పత్తి కాగలదు.

1963 లో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ శ్రీశైలం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇక్కడి డ్యామ్‌ను రాతితో కడుతున్నారు. నిధుల కొరతవల్ల పని మందకొడిగా సాగింది. 1974 నాటికి ఈ డ్యామ్‌కు సంబంధించిన పనులకుగాను 41.77 కోట్ల రూపాయల ఖర్చయింది.

తుంగభద్ర డ్యామ్

విజయనగర సామ్రాజ్యానికి రెండువందల సంవత్సరాలకు పైగా తుంగభద్రా తీరంలోని విజయనగరం రాజధానిగా ఉండినది. విజయనగర గత వైభవాన్ని బళ్లారి జిల్లాలో తుంగభద్రా తీరంలోని హంపీ శిథిలాలు గుర్తు చేస్తాయి. ఈ హంపికి కొంత ఎగువన తుంగభద్రానదికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆనకట్టను నిర్మించాయి. ఈ ఆనకట్ట పొడవు 2,441 మీటర్లు, ఎత్తు 49.38 మీటర్లు. ఈ ఆనకట్ట నిర్మాణం 1956 లో పూర్తయింది. నీటి పారుదల కాలువల త్రవ్వకంకూడా

పూర్తయింది. తుంగభద్రా డ్యామ్‌నుండి ఒక కాలువ, డ్యామ్‌కు దిగువన 33 మీటర్ల జలపాతంతోకూడిన హంపివద్ద మరోకాలువ సేద్యానికి నీటిని అందిస్తున్నాయి. 1979-80 నాటికి తుంగభద్రా డ్యామ్ నీటివల్ల 3.32 లక్షల హెక్టార్ల భూమి ఆంధ్రప్రదేశ్ కర్ణాటకల్లో సాగులోకి వచ్చింది. తుంగభద్ర కాలువలవల్ల ఏర్పడిన జలపాతాల నుపయోగించుకొని 72 మెగావాట్ల జల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తున్నారు.

భద్రా ప్రాజెక్టు

కర్ణాటకలో భద్రానదిమీద ఈ బహుళార్థసాధక ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. దీనివల్ల కర్ణాటకలో ఒకలక్ష హెక్టారులు సాగులోనికి వస్తాయి. 33 మెగావాట్ల జలవిద్యుచ్ఛక్తి ఉత్పన్నమౌతుంది. 1979-80 నాటికి ఒకలక్ష హెక్టార్లు సాగులోకి తెచ్చే వసతి ఏర్పడింది.

ఎగువ కృష్ణా ప్రాజెక్టు

కర్ణాటకలోని ఈ ప్రాజెక్టుకింద నారాయణ పురంవద్ద ఈ ఆనకట్ట కడతారు. ఏమట్టి అనేచోట నిర్మించిన మరొక డ్యామ్ ఉంది. ఇక్కడి జలాశయంలోకి ఎగువకృష్ణా ప్రాజెక్టు కాలువను కలుపుతారు. ఈ ప్రాజెక్టు మొదటిదశలో 4 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది.

ఘటప్రభ లోయ పథకం

కర్ణాటకలోని బెల్గాం, బీజాపూరు జిల్లాలకు సేద్యపునీటిని అందించడానికి ఈ అభివృద్ధి పథకాన్ని చేపట్టారు. కృష్ణానది ఉపనది ఘటప్రభమీద ఈ నిర్మాణం మూడు దశలలో జరుగుతుంది. రెండు దశలు పూర్తయ్యాయి. మూడోదశను 1976 లో ఆమోదించారు. ఈ పథకంవల్ల సాగులోకి వచ్చే మొత్తంభూమి 3.36 లక్షల హెక్టార్లు. 1979-80 నాటికి 1.47 లక్షల హెక్టార్ల భూమిని సాగులోనికి తెచ్చే వసతి కలిగింది.

మలప్రభ-ప్రాజెక్టు

కర్ణాటకలోని బెల్గాం జిల్లాలో కృష్ణానది ఉపనదియైన మలప్రభమీద ఒక ఆనకట్ట కడుతున్నారు. దీని పొడవు 164 మీటర్లు. ఎత్తు 43.4 మీటర్లు. జలాశయానికి రెండువైపులా కాలువలు తవ్వి సేద్యపునీటిని భూములకు అందిస్తారు. దీనివల్ల 2.13 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. 1979-80 నాటికి 1.05 లక్షల హెక్టార్ల భూమిని ఈ ప్రాజెక్టుక్రింద సాగులోకి తేవడం జరిగింది.

భీమా ప్రాజెక్టు

కృష్ణానది ఉపనదులలో అన్నిటికంటే పెద్దది భీమ లేక భీమరథినది. ఈ భీమా ప్రాజెక్టుకింద మహారాష్ట్రలో భీమానది ఉపనది అయిన పావనా నదిమీద పూనా జిల్లాలోని ఫగాన్న గ్రామంవద్ద ఆనకట్టను నిర్మించారు. షోలాపూర్ జిల్లాలోని

ఉజ్జయినివద్ద కృష్ణానదిమీద మరొక ఆనకట్ట కడుతున్నారు. పావనా డ్యామ్ పొడవు 1700 మీటర్లు, ఎత్తు 43 మీటర్లు. నిర్మాణం పూర్తయింది. ఉజ్జయిని డ్యామ్ పొడవు 2467 మీటర్లు, ఎత్తు 56.4 మీటర్లు. నిర్మాణం పూర్తి కావస్తున్నది. ఎడమ దరినుండి 160 కిలోమీటర్ల కాలువ భూములకు నీటినందిస్తుంది. ఈ ప్రాజెక్టువల్ల 1.74 లక్షల హెక్టార్ల భూమి సాగులోకి వస్తుంది. 1979-80 నాటికి 27,500 హెక్టార్ల భూమికి సేద్యపు నీటిని అందించే వసతి ఏర్పడింది.

నీరు మానవునకు నిత్యావసరం. తాగడానికి, పంటలు పండించుకోవడానికి, పారిశ్రామికాభివృద్ధికి నీటిని ఉపయోగించు కుంటున్నాం. ఆధునిక సమాజంలో వైజ్ఞానిక, సాంకేతికాభివృద్ధి విస్తారంగా జరిగింది, జరుగుతున్నది. నిత్యజీవితంలో సుఖ జీవనానికి విద్యుచ్ఛక్తి నుత్పాదించడానికి నీటిని వినియోగించు కుంటున్నాం. దక్షిణ భారతదేశంలో ప్రజల ప్రగతికి కృష్ణా, గోదావరులు మూలహేతువు లవుతున్నాయి.